ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 **తిరుపతి** జిల్లా వార్తలు

ఆదివారం 24 నవంబరు 2024




పక్షుల పుటిటిల్లు కళకళ!

ఎగురుతూ.. వాలుతూ.. ఈదులాడుతూ.. వేటకెళ్తూ.. ముక్కున చేపను కరుచుకుని తెస్తూ.. గూటి కోసం పుల్లలు ఏరుకొస్తూ.. కొమ్మలపై గూడు అల్లుకుంటూ.. నేలపట్టు పక్షుల కేంద్రం సందడిగా మారింది. అక్టోబరు నుంచే మొదలైన విదేశీ విహంగాల రాక నవంబరు ఆఖరుకు భారీగా పెరిగింది. వేల కిలోమీటర్ల నుంచి ఎగిరొచ్చిన ఈ పక్షులు.. ఇక్కడే జంటను వెతుక్కుని, గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లల్ని చేసి పెంచుతాయి. ఫిబ్రవరి నుంచి మే నెలదాకా రెక్కలొచ్చిన పిల్లల్తో కలిసి తిరుగు ప్రయాణాలు మొదలు పెడతాయి. ఇక్కడ పుట్టిన పిల్లలు దేశాలు దాటి వెళ్లిపోయినా, మరునటి ఏడాది సరిగ్గా నేలపట్టుకే వచ్చి వాలుతాయి. విదేశీ అతిథి పక్షులతో కళకళలాడుతున్న నేలపట్టు సందర్శకులకు కనువిందుగా మారింది. **ఆలస్యం ఎందుకూ.. మీరూ ఈ అందాలు ఆస్వాదించండి!**

8లో







ముఖ ఆధారిత వ్యవస్థ

తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నాం. టికెట్ బుక్ చేసుకున్న భక్తులే దర్శనానికి వచ్చారా లేక ఇతరులు వచ్చారా అన్నది ఇందువల్ల గుర్తించడానికి వీలవుతుంది. ఇప్పటిదాకా శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్యను ఖచ్చితంగా లెక్కించే పరిస్థితి లేదు. అంచనా వేసి చెప్పడమే జరుగుతోంది. ముఖ ఆధారిత వ్యవస్థ ఖచ్చితమైన లెక్క వస్తుంది. అలాగే సెక్యూరిటీ కోణంలో కూడా ఉపయోగపడుతుంది. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ అందించే సంస్థల కోసం టెండర్లు పిలిచాం. అలాగే ఆధార్ ఐడెంటిఫికేషన్ కోసం ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్రం నుంచీ అనుమతి రావాల్సి వుంది.

టీటీడీ ఆర్థికాంశాలపై స్టాఫ్ కాలేజీ అధ్యయనం

నిరంతరం ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిరాటంకంగా నడవాలంటే దేవస్థానానికి ఆర్థిక సుస్థిరత ఉండాలి. అదే సమయంలో పారదర్శకత మరింత అవసరం. భక్తులు సమర్పించే ప్రతి రూపాయీ ఎక్కడికి వెళుతోంది? దేనికి ఖర్చవుతోంది? అనేది అందరికీ తెలియాలి. అనవసర వ్యయం తగ్గించుకోవాలి. ఉద్యోగుల వేతనాలకు టీటీడీ వార్షికాదాయంలో 64 శాతం ఖర్చు అవుతోంది. 2014-15లో ఇది 45 శాతం మాత్రమే. దీనిపై ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నిపుణుల ద్వారా అధ్యయనం చేయిస్తున్నాం. ఖర్చును నియంత్రించాల్సిన అవసరముంది.

పేరుకుపోతున్న చెత్తపై నిపుణుల అధ్యయనం

తిరుమలలో వాహన కాలుష్యం అధికంగా వుంది. దశలవారీగా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. తిరుమలలో రోజుకు 70 టన్నుల చెత్త పేరుకుంటోంది. దాన్ని రోజువారీ కిందకు తరలించడానికి వీలు కాదు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఐఏహెచ్ఎస్ నుంచీ నిపుణులు వచ్చి అధ్యయనం చేశారు. వారం రోజుల్లో వారి నుంచీ నివేదిక అందనుంది. దానికనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

"సనాతన ధర్మ పరిరక్షణకు, వ్యాప్తికీ టీటీడీ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. హిందూ ధార్మిక పరిషత్, వేద విశ్వ విద్యాలయం, వేద పాఠశాలల ద్వారా శాశ్వత కార్యక్రమాలు నడుస్తున్నాయి. వాటి కార్యక్రమాలను విస్తరించే ఆలోచనతో చర్యలు చేపడుతున్నాం."

భక్తుల అభిప్రాయం మేరకే

తిరుమల అభివృద్ధి

ఇందుకోసం ప్రత్యేక ఐటీ వ్యవస్థ ఏర్పాటు

తిరుమల కోసం విజన్ డాక్యుమెంట్

తిరుపతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల అభిప్రాయాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకు ఒక వ్యవస్థనే ఏర్పాటు చేయబోతున్నాట్టు వెల్లడించారు. రవాణా, వసతి, దర్శనం, లడ్డూ, అన్నప్రసాదాలు వంటి వాటి గురించి భక్తులను కలిసి అభిప్రాయాలు సేకరించేందుకు ఐటీ విభాగం కింద టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. సేకరించిన అభిప్రాయాలను విశ్లేషించి సేవలను మెరుగుపరచుకుంటామని ఈవో చెప్పారు. ఈ వ్యవస్థ ఏర్పాటు గురించి ఏపీ డిజిటల్ కార్పొరేషన్ నిపుణులు పరిశీలన చేస్తున్నారని తెలిపారు. తిరుమల పవిత్రత విషయంలోనూ, భక్తులకు సేవల విషయంలోనూ రాజీపడరాదని సీఎం చంద్రబాబు కఠినమైన ఆదేశాలిచ్చిన నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మరిన్ని అంశాలపై ఈవో శ్యామలరావు అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

తిరుమల విజన్

తిరుమల యాత్ర అన్ని విధాలా సంతృప్తి కలిగించి దివ్యానుభూతిని మిగిల్చేలా వుండాలన్నది టీటీడీ అంతిమ లక్ష్యం. తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాలికంగా భక్తులకు నాణ్యమైన సేవలందేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించే పనిలో వున్నాం.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ

తిరుమలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. మ్యాపింగ్ లేదు. అవసరమైన పరికరాల్లేవు. అందుకని గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ నుంచీ నిపుణులను రప్పించి అధ్యయనం చేయించాం. వారి సలహాల మేరకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తాం. దానికోసం ఓ డివిజన్ ఏర్పాటు చేస్తాం.

వేటగాళ్ల కరెంటు ఉచ్చు

- తీగలకు తగిలి గజరాజు మృతి
- దేపట్లవారిపల్లె సమీపంలో ఘటన



ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో, సీసీఎఫ్



మృతి చెందిన మగ ఏనుగు

భాకరాపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం వేటగాళ్లు లాగిన కరెంటు తీగలకు తగిలి గజరాజు మృతి చెందింది. ఈ ఘటన చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ దేపట్లవారిపల్లె సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. డీఎఫ్‌వో వివేక్ తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన శివారెడ్డి మామిడి తోటలో అడవి పందుల కోసం వేటగాళ్లు.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి తీగలు లాగారు. కొద్ది రోజులుగా పులిచెర్ల మండలంలో తిరుగుతున్న 18 ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలంలోని దిగవూరు, ఆరికలవారిపల్లె గ్రామాల పొలాల గూండా దేపట్లవారిపల్లె సమీపానికి వచ్చాయి. అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి టమోటా తోటను, పక్కనే ఉన్న మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. దాని పక్కనే ఉన్న శివారెడ్డి మామిడి తోటలోకి వెళ్లగా.. అక్కడ అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు ఏనుగు కాళ్లకు తగలడంతో ఆ విద్యుత్ తీగను తొండంతో లాగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో వేటగాళ్లు ఏనుగు వద్ద విద్యుత్ తీగలను కత్తిరించుకుని వెళ్లిపోయారు. ఏనుగు తొండం వద్ద విద్యుత్ తీగ అలాగే ఉండిపోయింది. విద్యుత్ తీగ తగలడంతో ఏనుగు కాలు, తొండానికి గాయమైనట్లు డీఎఫ్‌వో తెలిపారు. సంఘటన స్థలాన్ని సీసీఎఫ్ సైల్వం, ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ రియాజ్ అహ్మద్ పరిశీలించారు. అనంతరం జూపార్కు వైద్యులు తోయిబా సింగ్ నేతృత్వంలో వైద్య బృందం, భాకరాపేట పశు వైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు ఊర్లలో కరెంటు తీసేశారు

ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి: భాకరాపేట మండలం దేపట్లలవారిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో ఏనుగు మృతి చెందిన నేపథ్యంలో శనివారం రాత్రి రెండు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేశారు. శనివారం రాత్రి 10 గంటలకు శాంతినగర్ చెరువులో 10 ఏనుగులు తిష్ట వేశాయి. తమ మందలోని ఏనుగు మృతి చెందితే ఆ సమీపంలోకి గుంపుగా చేరి ఘీంకరించి సంఘీభావం తెలుపుతాయి. ఆ పరిస్థితుల్లో మనుషులు కనిపిస్తే దాడి చేసే అవకాశం ఉంటుంది. అందుకని ఫారెస్టు అధికారులు, పోలీసులు సోషల్ మీడియాలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొంతమంది రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు వేస్తారేమోననే ఉద్దేశ్యంతో అధికారులు ఈ రెండు గ్రామాల పరిధిలో సరఫరాను నిలిపివేయించారు. దీంతో గ్రామాల్లో చీకట్లు అలుముకున్నాయి.

తిరుపతి వైసీపీలో

టీడీఆర్ టెర్రర్

- తుడా అధికారులతో కలసి విజిలెన్సు క్షేత్రస్థాయి తనిఖీలు
- నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లలో ముగిసిన పరిశీలన
- వెలుగుచూడనున్న కోట్లాది రూపాయల అవినీతి



విజిలెన్సు అధికారులు తనిఖీ చేస్తున్న కొంకా చెన్నాయిగుంట రోడ్డు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిమ్మిని బమ్మిని చేసి టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడిన సూత్రధారులు, పాత్రధారుల గుట్టు బయటకు రానుంది. ఈంతో తిరుపతి వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. తిరుపతి నగర పాలక సంస్థలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్ల కుంభకోణం డొంక వేగంగా కదులుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని చేతిలోకి తీసుకుని తిరుపతిలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన 21 కొత్త, ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్లలో జరిగిన రూ.కోట్లాది అవినీతిపై నిగ్గు తేల్చడానికి జిల్లా విజిలెన్సు విభాగం రంగంలోకి దిగింది. తుడా అధికారులతో కలసి క్షేత్రస్థాయి విచారణ మొదలుపెట్టింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 400కు పైగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రూ.4వేల కోట్ల కుంభకోణం జరిగిందని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి గతంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై విజిలెన్సు డీజీపీ విచారణకు ఆదేశించారు. గత 10 రోజులుగా జిల్లా విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, తుడా ఇంజనీరింగ్, సర్వే అధికారులు, విజిలెన్సు సిబ్బంది క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి విచారణ సాగిస్తున్నారు. ఇప్పటికి నాలుగు రోడ్లలో తనిఖీలు ముగియగా.. విజిలెన్సు అధికారుల బృందానికి ఒళ్లు గగుర్పాటయేలాఆ అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు వెలుగులోకి వస్తోంది. ఒక్కో రోడ్డులో కనీసం రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు సగటున అవినీతి చోటు చేసుకుని ప్రజా ధనం విచ్చలవిడిగా మట్టిపాలు చేశారని విచారణలో తేలింది. పెద్దఎత్తున కోట్లాది రూపాయలు అవినీతి జరిగి ఉంటుందని విజిలెన్సు అధికారులు అంచనా వేస్తున్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై పూర్తి స్థాయిలో నిగ్గు తేల్చి త్వరలోనే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందచేస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు.

తనిఖీలు పూర్తి చేసిన రోడ్లు ఇవీ

- అక్కారంపల్లి 40 అడుగుల రోడ్డు అరకిలోమీటరు వరకు కొత్తగా ఏర్పాటు చేశారు. దీనికోసం 25 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- అలాగే 1.2 కిలోమీటర్ల పొడవుతో రోడ్డు డెవలప్మెంటు కింద రేణిగుంట రోడ్డు అయిల్ మిల్లు నుంచి స్టేడియం వరకు ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం 62 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- కొంకా చెన్నాయగుంట 100 అడుగుల రోడ్డు 1.29 కిలోమీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన ఈ రోడ్డులో 13 టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు.
- 150 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన మానస సరోవర్ 40 అడుగుల రోడ్డులో రెండు బాండ్లు పంపిణీ చేశారు. ఇందులో మొత్తం 102 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.

అవినీతి జరిగిందిలా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో చేపట్టిన చేసిన 21 కొత్త. ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రణాళికా బద్ధంగా, రోడ్డు డెవలప్మెంటు ప్లాన్ ఆమోదం మేరకు జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కో విధంగా, స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూడ బలుక్కుని రూ.కోట్లలో దోచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఇప్పటి వరకు విచారణ చేసిన నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లు అడ్డగోలుగా ఏర్పాటు చేసుకున్నట్లు తేలిందని విచారణ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న మార్కెట్ ధర కంటే ఎక్కువగా భూమి విలువ పెంచి, తదనుకుణంగా టీడీఆర్ బాండ్లు జారీచేసినట్టు తెలుస్తోంది. అలాగే ఖాళీ స్థలానికి కూడా మార్కెట్ ధర కంటే ఎక్కువగా వాణిజ్య భూములను చూపించి మార్కెట్ విలువ కంటే పది రెట్లు ఎక్కువ ధరకు టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. టీడీఆర్ బాండ్లలో సూచించిన కొలతలకు క్షేత్ర స్థాయిలో ఉన్న కొలతల మధ్య రోడ్డు వెడల్పు, పొడవులో చాలా తేడాలున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. ప్రతి రోడ్డు వెడల్పు, పొడవు కొలిచి ప్రతిపాదనల్లో సూచించిన కొలతలు, రోడ్లు వేసిన కొలతలు పరిశీలించి నివేదికను విజిలెన్సు ఎస్పీకి సమర్పిస్తున్నారు. ఇందులో ఇద్దరు మాజీ ప్రజా ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో నెల రోజుల వ్యవధిలో మొత్తం రోడ్లు తనిఖీ చేసి అవినీతి అక్రమాలపై సమగ్ర నివేదిక అందచేయనున్నారు.

ఆ విద్యార్థులకు వైద్య పరీక్షలు

డ్రగ్స్ ఆరోపణలపై అధికారుల స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీలో డ్రగ్స్ కలకలంపై ఉన్నతాధికారులు స్పందించారు. యాంటీ డ్రగ్స్ కమిటీతో వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమశ్రీ శనివారం సమావేశమయ్యారు. డ్రగ్స్ తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు రుయాలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రుయా నివేదిక, యాంటీ డ్రగ్స్ కమిటీ సిఫారసులను అనుసరించి తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఆ మేరకు అధికారులకు మౌఖిక ఆదేశాలిచ్చారు.

ఎందుకీ మౌనం..?

వైసీపీ వీరవిధేయుల్లో ఆవేదన

తిరుపతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ నాయకుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పగ్గాలు వచ్చాయన్న ఆనందోత్సాహాలు కొద్ది రోజులకే వైసీపీ శ్రేణుల్లో ఆవిరైపోతున్నాయి. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల వైపు చూడడంతో ముఖ్యనాయకులు నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు విజయవాడకు వెళ్లడం, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో చర్చించడం వంటి పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గుబులు రేపుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి కుడిభుజంగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్దారెడ్డితో పాటు అతడి వర్గీయులు, భూమన ఫొటోను బంగారు ఉంగరాలు, లాకెట్లో వేసుకుతిరిగిన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపించడంతో వైసీపీ వర్గాల్లో నిస్తేజం ఆవహించింది. ఉమ్మడి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భూమన ఆయా నియోజకవర్గాల సమావేశాల్లో బిజీగా ఉంటున్నారు. ఆయన తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ కొన్నిరోజులుగా తిరుపతిలో కనిపించడంలేదు. అవిశ్వాసంపై ఏమి జరిగినా స్వాగతిస్తామన్నట్టుగా మేయర్ శిరీష ఉండడంతో వైసీపీ సీనియర్ కార్పొరేటర్లు ఆవేదనతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో 'తిరుపతి రాజకీయం రివర్స్ అయిపోయింది. కాపాడుకోవాల్సిన వాళ్లు సైలెంట్ అయిపోయారు. కాపాడాల్సిన వారు కూడా మౌనం దాల్చారు' అంటూ భూమన ముఖ్య అనుచరుడు, కార్పొరేటర్ ఎస్కే బాబు తన ఆవేదనను శుక్రవారం సాయంత్రం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఇది గమనించిన భూమన సాహితీ మిత్రుడొకరు.. 'ఏంది బాబూ ఇది?' అంటూ ఇంటిపోరును వీధిలో వేసుకుంటామా? అన్నట్టుగా అసంతృప్తితో కామెంట్ చేశారు. దీంతో కొద్దిసేపటికి ఫేస్‌బుక్ నుంచి తన పోస్ట్‌ను ఎస్కే బాబు తొలగించారు. అప్పటికే రాజకీయ వర్గాల్లో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. చేజారిపోతున్న కార్పొరేటర్లను బుజ్జగించి కాపాడుకోవాల్సిన మేయర్ చేతులెత్తేయడం, తమకే బలముందని కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేయాల్సిన భూమన పట్టించుకోకపోవడం వైసీపీలో చర్చగా మారుతోంది.

నారావారిపల్లెలో ఏర్పాట్ల పరిశీలన



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఈనెల 28వ తేదిన జరిగే మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియల ఏర్పాట్లపై ఎమ్మెల్యే పులివర్తి నాని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే నాని విజయవాడలో అసెంబ్లీ ముగిసిన వెంటనే నేరుగా శనివారం నారావారిపల్లెకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. కర్మక్రియలకు వేలాదిమంది తరలి రానున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ఈకార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, చంద్రగిరి, తిరుపతి రూరల్ టీడీపీ మండలాధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు రమేష్‌రెడ్డి, కోదండరామా నాయుడు, వేమూరు మధు, నరసింహారెడ్డి, రాకేష్‌చౌదరి, బాలాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంచు విష్ణు జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మా అధ్యక్షుడు, ఎంబీయూ ప్రోఛాన్సలర్ మంచు విష్ణు జన్మదిన వేడుకలను అధ్యాపకులు, విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కేక్ కట్‌చేసి, చాక్‌లెట్స్ పంచుకొని సంబరాలు చేసుకొన్నారు. కార్యక్రమంలో ఎంబీయూ వైస్ ఛాన్సలర్ ప్రొవోస్ట్ డాక్టర్ నాగరాజురామారావ్, వైస్ ఛాన్సలర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, ఫైనాన్స్ ఆఫీసర్ బి.రవిశేఖర్, డీన్‌లు, డిప్యూటీ రిజిస్ట్రార్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న



చంద్రగిరి, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. 10.30 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



గౌతమ్ - ఆదిత్యరామ్

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఎమ్మెల్యేలు తాటిపర్తి చంద్రశేఖర్, ఈశ్వరరావు, వెంకటప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎంపీ గురుమూర్తి, సినీ హీరో గౌతమ్, నిర్మాత ఆదిత్య రామ్, టీటీడీ మాజీ జేఈవో పోలా భాస్కర్ ఉన్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆర్యవైశ్య యువజన సంఘం రూరల్
నూతన కార్యవర్గం ఎంపిక



డమరుకనాథ్ గుప్తా, వెంకటసుబ్బరాజు, హరీశ్ బాబు

భాకరాపేట, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): ఆర్యవైశ్య యువజన సంఘం తిరుపతి రూరల్ అధ్యక్షుడిగా చిన్నగొట్టిగల్లుకు చెందిన నూనె డమరుకనాథ్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వెంకటసుబ్బరాజు, కోశాధికారిగా హరీశ్‌బాబును నియమిస్తూ ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కిశోర్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్ నియామకపత్రాలు అందజేశారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం



ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మొహిద్దీన్ బాషా

పాకాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. దేశానికి సేవచేసే అవకాశం ఎన్‌సీసీ తోనే సాధ్యమన్నారు. వివిధ క్యాంపుల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఈశ్వరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు మోహన్ బెహరా, రమణమ్మ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువీధుల్లో గోవిందనామ సంకీర్తనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆధ్యాత్మిక శోభను పెంచేందుకు స్థానిక భజన మండలి కళాకారులు శనివారం వీధుల్లో గోవింద నామ సంకీర్తనం చేపట్టారు. సంప్రదాయ వస్త్రాలతో తిరునామాలు ధరించి మంగళ వాయిద్యాల నడుమ గోవింద నామ సంకీర్తన ఆలపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మనాభన్, వెంకటాద్రి, విక్రమ్, విజయ భాస్కరరెడ్డి, హనుమంతరావు, సూర్యప్రకాష్, గుండాల గోపినాథరెడ్డి, సుబ్బారెడ్డి, మునినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్
- 15 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో మామండూరు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్‌చేసి, 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఫణీంద్రకు అందిన సమాచారం మేరకు ఎస్ఐలు సుధాకర్‌రావు, గిరి తమ సిబ్బందితో వెళ్లి మామండూరు వద్ద తనిఖీలు చేశారు. అదే గ్రామానికి చెందిన చెంగయ్యనాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్‌చేసి, 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో సిబ్బంది నజీర్, జానకిరామ్, సురేంద్రబాబు పాల్గొన్నారు.

దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన మహేంద్ర నాయుడు

చంద్రగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, నాగయ్యగారిపల్లెలో పొలం వద్ద ఇరువర్గాలకు వివాదం తలెత్తడంతో ఓవ్యక్తిపై పక్క పొలంలో పనిచేస్తున్న కూలీలు దాడిచేశారు. ఈదాడిలో మహేంద్ర నాయుడు తలకు తీవ్ర రక్త గాయమైంది. నాగయ్యగారిపల్లె వద్ద స్వర్ణముఖినది ఒడ్డున మహేంద్ర నాయుడికి, తిరుపతికి చెందిన టీడీపీ నేతకు పొలం ఉంది. శనివారం టీడీపీ నేత పొలంలో కూలీలు పనులు చేసుకుంటుండగా మహేంద్ర నాయుడు వారిని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగటంతో కూలీలు మహేంద్ర నాయుడిపై రాయితో దాడిచేశారు. ఈదాడిలో అతడి తలకు రక్త గాయమైంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టీచింగ్ అసిస్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో టీచింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని బీజేపీ నేత కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ పనితీరు ఒక విధంగా ఉంటే, ఎస్వీయూలో ఇందుకు భిన్నంగా ఉందన్నారు. ఆరు నెలలు అయినా ఇంకా నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

గాంధీపురం ఇలా ఉంది..!
● రోడ్డుపక్కన వ్యర్థాలు, ఇసుక, కంకరతో స్థానికులకు తిప్పలు



రోడ్డు పక్కనే ఉన్న కంకర, ఇసుక డంప్, టెంకాయల చిప్పలు, చెత్త, ప్లాస్టిక్‌తో కూడిన వ్యర్థాలు

తిరుపతిరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం గాంధీపురం సచివాలయానికి సమీపంలోని రోడ్డు పక్కన దృశ్యాలు ఇది. అవిలాల చెరువు ప్రహరీకి ఆనుకుని ఉన్న రోడ్డుపక్కనే ఇసుక, కంకర డంప్ చేసి చిల్లర వ్యాపారం చేస్తుంటారు. అలాగే ఇంటినిర్మాణ వ్యర్థాలు, టెంకాయల చిప్పలను కుప్పలుతెప్పలుగా రోడ్డుపక్కనే పోసేస్తున్నారు. ఇళ్లలోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం రోడ్డుపక్కనే పడేసి వెళ్తున్నారు. నగరంలోకి వెళ్లే పాఠశాల వ్యాన్లకు, ఇతర వాహనాల్లో వెళ్లేవారికి ఇవి ప్రమాదకరంగా మారుతున్నాయి. పంచాయతీ సిబ్బంది వారంలో రెండు రోజులు మాత్రమే వీటిని తొలగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా మదర్ డెయిరీ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ రోడ్డుని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం
● అధికారులతో సమీక్ష.. ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఈవో



అమ్మవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుచానూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఘనంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈనెల 28నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం రాత్రి ఆయన తిరుపతిలోని పద్మావతీ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో సమీక్షించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిసెంబరు 6న జరగనున్న పంచమీతీర్థం కార్యక్రమానికి పుష్కరిణిలో తోపులాటలు జరగకుండా, ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు, విజిలెన్స్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోజూ వాహన సేవల అనంతరం భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అవసరమైన వైద్య బృందాలు, బారికేడ్లను పటిష్ఠంగా ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ ఫైర్ సేఫ్టీ, ప్రాథమిక చికిత్స వైద్య బృందాలు, సైన్‌బోర్డులు, భక్తుల తాకిడికి తగ్గట్టుగా అన్నప్రసాదాల పంపిణీ చేపట్టాలన్నారు. అంతకు ముందు ఆయన అధికారులతో కలిసి తిరుచానూరులోని పసుపు మండపం నుంచి పుష్కరిణి, ఆలయ మాడవీధుల్లో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. చక్రస్నానం జరిగే ముందు రోజే వేలాది మంది భక్తులు తిరుచానూరుకు చేరుకుంటారని, వారికి వసతి, బసతోపాటూ అన్నప్రసాదాలు కూడా అందిస్తామన్నారు. శుక్రవారపు తోటలో పుష్పప్రదర్శనశాలతోపాటు ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు చేపట్టాలని ఈవో సూచించారు. బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో శ్రీధర్, టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక దారి సమస్యకు పరిష్కారం



ఎక్సకవేటర్‌తో మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె అరుంధతీవాడకు సంబంధించి ఎన్నోఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న శ్మశానవాటిక దారి సమస్యకు పరిష్కారం లభించింది. సి.మల్లవరం పంచాయతీలోని సత్తార్‌బైలు, పైడిపల్లె అరుంధతీవాడ సరిహద్దులో ఉన్న శ్మశానానికి వెళ్లేందుకు కొన్నేళ్లుగా దారిసమస్యతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ చొరవతో ఇరు పంచాయతీలకు చెందిన టీడీపీనేతలు మనోహర్‌చౌదరి, భానుకుమార్‌రెడ్డిలు కలసి రైతులను ఒప్పించి దారిసమస్యను పరిష్కరించారు. దీనిలో భాగంగా శ్మశానానికి వెళ్లే దారిలోని మొక్కలు, ముళ్లచెట్లను శనివారం ఎక్సకవేటర్ సాయంతో తొలగించారు. పైడిపల్లెనుంచి 15అడుగుల వెడల్పుతో చదునుచేసి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మనోహర్‌చౌదరి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఈ దారిలో సిమెంటురోడ్డు వేసేందుకు చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే తెలిపారన్నారు. కాగా దారిసమస్యకు పరిష్కారం రావడంపట్ల ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

తొలిసారిగా శ్రీమన్నారాయణీయం సహస్ర గళార్చన

తిరుమల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆస్థాన మండపంలో శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమన్నారాయణీయం సహస్ర గళార్చనతో సప్తగిరులు పులకించాయి. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఈకార్యక్రమం సాయంత్రం వరకు జరిగింది. 1,036 శ్లోకాలతో కూడిన శ్రీమన్నారయణీయం కేరళలో సుప్రభాత పారాయణంగా ప్రాచుర్యంలో ఉంది. తమిళనాడులో ఈ పారాయణం చేస్తున్న భక్తులు అనేక మంది ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా శ్రీవారి సన్నిధిలో ఈపారాయణం ఏర్పాటు చేశారు. సుమారు 1,200 మందికిపైగా సాధకులు స్తోత్ర సమర్పణ చేశారు. అగ్రేపశ్యామి, సాంద్రాయనం బృందాలు రెండేళ్లుగా ఈపారాయణంపై సాధకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వచ్చాయి. శ్రీమన్నారాయణీయ పారాయణం అభ్యసించిన వారంతా తిరుమల క్షేత్రంలో గళార్చనలో పాల్గొని నృసింహ భజన, హనుమాన్ చాలీసా, జయజనార్దన భజన, గోవింద నామాలు, రాధేభజన, పంచరత్న స్తోత్రాలను పారాయణం చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. శ్రీమన్నారాయణీయ సహస్ర గళార్చనలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సాధారణ విషయం కాదని, ఇందుకు కృషి చేసిన అరుణ, టీటీడీ డీఈ చంద్రశేఖర్‌కు అభినందనలు అన్నారు. ఇలాంటి సామూహిక పారాయణం వల్ల మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌కు సన్మానం



తిరుపతి, నవంబరు23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివంను శ్రీకాళహస్తి నాయకులు సత్కరించారు. శనివారం కొర్లగుంటలోని ఆయన నివాసానికి నాయీ బ్రాహ్మణులు వచ్చి, ఆయనకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. సంఘ నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కొత్తపట్నం మహేంద్ర, జె.బాలసుబ్రమణ్యం, సి వెంకటముని, పి.సుబ్రహ్మణ్యం, వి.కరుణాకర్, కె.హేమాద్రి, సుబ్రహ్మణ్యం, ఎస్.సతీష్, మురళి, పి.సుబ్బు, ఎం.మునివెంకయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



తిరుపతి(వైద్యం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్, వయనాడ్‌లో కాంగ్రెస్ విజయం సాధించడం పట్ల తిరుపతిలో ఆ పార్టీ నేతలు శనివారం సంబరాలు చేసుకున్నారు. నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, విజయ నినాదాలు చేశారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు వెంకట నరసింహులు, లోకేష్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, నేతలు నరేంద్ర, శివబాలాజీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న యంత్రాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో కొన్ని నెలలుగా పేరుకున్న చెత్తను ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు తొలగించారు. ఆటోనగర్‌లో డంపింగ్ యార్డులను తలపించేలా చెత్త నిండి ఉన్న విషయంపై ఆంధ్రజ్యోతిలో ఆటోనగర్‌లో అడుగుపెడితే అంతే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన మున్సిపల్ అధికారులు మొదట అక్కడ ప్రధాన రోడ్డులో పేరుకుని ఉన్న మూడు టిప్పరు లారీల చెత్తను తొలగించారు. మిగిలిన చెత్తను పూర్తి స్థాయిలో తొలగించే దిశగా చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అత్యాచార నిందితులను శిక్షించాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖలో లా స్టూడెంట్‌పై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి మాధవకృష్ణ, యూనివర్సిటీ నేత అశోక్ డిమాండ్ చేశారు. విద్యార్థినులతో కలిసి శనివారం సాయంత్రం ఎస్వీయూలో చేపట్టిన కొవ్వొత్తుల ప్రదర్శనలో వారు పాల్గొని మాట్లాడారు.


యూటీఎఫ్ నగర నూతన కార్యవర్గం



హేమాద్రిబాబు, ఖాదర్‌బాషా, ప్రభుకుమార్

తిరుపతి(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) తిరుపతి నగర కార్యవర్గం ఎన్నిక శనివారం రాత్రి యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అబ్జర్వర్, సంఘం జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్‌రెడ్డి, తెలిపారు. గౌరవాధ్యక్షురాలిగా వరలక్ష్మి, అధ్యక్షుడిగా హేమాద్రిబాబు, సహాధ్యక్షులుగా కృష్ణకుమార్, నిర్మలబాయ్, ప్రధాన కార్యదర్శిగా ఖాదర్‌బాషా, కోశాధికారిగా ప్రభుకుమార్, మహిళా కార్యదర్శులుగా కవిత, మారుతీదేవి, ప్రసన్నలక్ష్మి, కన్వీనర్‌గా బండి యామిని, సీపీఎస్ కన్వీనర్లుగా గుణశేఖర్, సునీత, ప్రభాకర్‌రావు, ఫామిలీ వెల్ఫేర్ స్కీం కన్వీనర్‌గా గోపాల్ ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా తొమ్మిది మందిని ఎన్నుకున్నారు. నూతన కమిటీని యూటీఎఫ్ జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఎమరాల్డ్స్‌లో ఘనంగా ఎలివేట్-2024



మోహితకు అవార్డు అందజేస్తున్న కళాశాల సంచాలకులు, ఉప సంచాలకులు

తిరుపతి(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఎలివేట్-2024 కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. బిజినెస్ క్విజ్, పికాస్సో, స్పీకప్, స్టాక్ బజ్, బిజినెస్ ప్రపోజల్, జస్ట్ యార్డ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ మాట్లాడుతూ బీకామ్ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ఏటా ఎలివేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును తృతీయ బీకామ్ విద్యార్థిని మోహిత సాధించారు. పోటీల్లోవిజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో కళాశాల ఉప సంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్ వలి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రమేష్, నరసింహ పాల్గొన్నారు.

పోటీతత్వంతో పరిశ్రమల్లో నాణ్యత

తిరుపతి(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పోటీతత్వం ఉన్నప్పుడే నాణ్యత ప్రమాణాలు పాటిస్తారని, ఇదే సూత్రం పరిశ్రమలకూ వర్తిస్తుందని సీఐఐ తిరుపతి ప్రతినిధి చందన్ పట్నాయక్ అన్నారు. ఒక హోటల్లో శనివారం 37వ సీఐఐ రాష్ట్ర స్థాయి క్వాలిటీ సర్కిల్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్నాయక్ మాట్లాడుతూ పోటీలతో పరిశ్రమల శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 21 జట్లు పాల్గొనగా బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టీమ్ విజయం సాధించగా అపోలో టైర్స్ లిమిటెడ్‌కు చెందిన టీమ్ రన్నరప్‌గా నిలిచింది. కార్యక్రమంలో పలు పరిశ్రమల ప్రతినిధులు హనుమంతరావు, అరిందమ్ మలకర్, రాజీవ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫార్మసీ పూర్వ విద్యార్థులు

తిరుపతి(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం వేడుకగా జరిగింది. 1994-96 బ్యాచ్‌కు చెందిన ఫార్మసీ విభాగం విద్యార్థులు కళాశాల ఫార్మసీ విభాగం వేదికగా కలిశారు. 20 సంవత్సరాల తర్వాత కలిసిన మిత్రులు ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. అలనాటి విషయాలను గుర్తుచేసుకుంటూ ఆనంద పరవశులయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, జనరల్ సెక్షన్ హెడ్ గౌరీశంకర్, ఫార్మసీ సెక్షన్ హెడ్ జి.కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయంపై తిరుపతిలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నాలుగుకాళ్ల మండపం వద్ద టపాసులు కాల్చి సందడి చేశారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పాటిబండ్ల మురళి, జనార్దన్ రెడ్డి, సుబ్రహ్మణ్యరెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, మస్తాన్, విగ్రహాల కళ్యాణి పాల్గొన్నారు. రాఘవేంద్ర నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు విజయోత్సవాలు జరుపుకున్నాయి. సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, సాయి, నవీన్, చందు, గవ్వల అశోక్, లక్ష్మీ నరేష్, రావూరి అశోక్, రమణ, నరేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణలో ఔషధాల పాత్ర కీలకం

తిరుపతి(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోగి ప్రాణాలు నిలబెట్టాలంటే వైద్యం అందిస్తే సరిపోదని, ఔషధాల పాత్ర ఎంతో కీలకమని టాటా క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ ప్రశాంత్ అన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ తిరుపతి ఆధ్వర్యంలో ఫార్మసిస్టులు ఔషధాల ప్రాముఖ్యతను వివరిస్తూ ఎస్వీ ఉన్నత పాఠశాల నుంచి నగరంలో పలుచోట్ల శనివారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్, ఏఎస్పీ రవి మనోహరాచారి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులను ఫార్మాసిస్టు పర్యవేక్షణలో తీసుకోవాలన్నారు. యూనివర్సిటీల అధికారులు, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ అధికంగా వాడితే సమస్యలు

తిరుపతి(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యాంటీ బయాటిక్స్ అధిక మోతాదులో వాడితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అన్నారు. ప్రపంచ సూక్ష్మజీవి నాశక ఔషధ అవగాహనా వారం(వరల్డ్ యాంటీమైక్రోబియల్ అవేర్నెస్ వీక్) సందర్భంగా వైద్య విద్యార్థులతో కలిసి ఎస్వీ వైద్య కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ కార్యకర్తలు శనివారం యూనివర్సిటీలో నిరసనప్రదర్శన చేపట్టారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సమస్యల సుడిగుండంలా ఉందని ఆరోపించారు.

తిరుపతి





కళాకారుల నృత్య ప్రదర్శన

కళలకు కాణాచి తిరుపతి

అన్నమయ్య వంశస్థులు హరినారాయణాచార్యులు

మహతిలో ఆకట్టుకున్న సంగీత, నృత్య ప్రదర్శనలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కళలకు కాణాచి అని అన్నమయ్య వంశస్థులు హరినారాయణాచార్యులు పేర్కొన్నారు. జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య సంగీత, నృత్యోత్సవం మహతిలో శనివారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కళలు మనిషిని మానవీయంగా మలుస్తాయన్నారు. తిరుపతిలో సాంస్కృతిక వారసత్వం కొనసాగాలని ఆకాంక్షించారు. టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు చిన్నంగారి రమణ మాట్లాడుతూ కళలు సమాజానికి విజ్ఞానాన్నీ వినోదాన్ని అందిస్తాయని తెలిపారు. టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో సాంస్కృతిక కార్యక్రమాల విజయవంతానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. జై కిసాన్, జై జవాన్, జై కళాకార్ సంస్థ అధ్యక్షుడు కేవీ రమణరావు మాట్లాడుతూ పుష్కరకాలంగా కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సనాతన ధర్మ బుక్ ఆఫ్ రికార్డ్ కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కళాకారులు ప్రదర్శించిన జానపద, క్లాసికల్, సెమి క్లాసికల్, భక్తి పాటలు, కీర్తనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బుల్లెట్ రమణ, ధర్మయ్య, కేవీ రమణ, కె.సుధాకర్, కళాకారులు సత్యవాణి, సుహాసిని, కమల, అనురాధ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హరినారాయణాచార్యులు తదితరులు

30 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా ముద్దనూరు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసి, 30 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను డీఎస్పీ జి.బాలిరెడ్డి శనివారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వెల్లడించారు. రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కె.అల్లీబాషా బృందం ఎస్పీఓ పి.సుప్రజతో కలిసి జమ్మలమడుగు వైపు తనిఖీలు చేస్తుండగా శనివారం ఉదయం ముద్దనూరు మండలం శెట్టివారిపల్లె ఫారెస్టు బీటు పరిధిలోని ఖాళీ ఇళ్ల వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేస్తూ కనిపించారు. వారిని టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టే ప్రయత్నం చేయడంతో కొందరు పారిపోగా, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారు కడప జిల్లాకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. 30 ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లను, కారుతో సహా ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నామినేటెడ్ పోస్టుపై చట్టం ప్రతిపాదన హర్షణీయం

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయ పాలక మండళ్లలో విశ్వబ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ చట్టం చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రతిపాదించడం హర్షణీయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహరాచారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదించి విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు.

ఐపీఎల్ వేలంలో తిరుపతి కుర్రాడు



యద్దెల గిరీష్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ పోటీల వేలం పాటకు తిరుపతి యువకుడు యద్దెల గిరీష్‌కుమార్‌రెడ్డికి స్థానం దక్కింది. ఆది, సోమవారాల్లో సౌదీ అరేబియాలో జరగనున్న ఐపీఎల్ వేలం పాటలో ఈ కుర్రాడిని ఏ టీం దక్కించుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

నేపథ్యమిది..

రామచంద్రాపురం మండలం అనుపల్లె పంచాయతీ నూతిగుంటపల్లెకు చెందిన యద్దెల చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు వై.గిరీష్ కుమార్‌రెడ్డి. వ్యవసాయ కుటుంబమైనా బాగా చదువుకున్నాడు. క్రికెట్‌పై ఆసక్తి ఉండడంతో అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుని ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. స్కూల్, జిల్లా, జోనల్స్, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహించాడు. అంచలంచెలుగా ఎదిగి ఆంధ్రా ప్రీమియర్‌లీగ్‌కు ఎంపికయ్యాడు. గత జూలైలో జరిగిన ఏపీపీఎల్ టోర్నీలో బాగా రాణించాడు. నాలుగు మ్యాచుల్లో తొమ్మిది వికెట్లు తీసి, సత్తాను నిరూపించుకున్నాడు. ఐపీఎల్ ఆక్షన్ ఎంపిక కోసం జరిగిన పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి స్థానం దక్కించుకున్నాడు. ఏపీ నుంచి ఎంపికైన 11మందిలో స్థానం దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో గిరీష్‌కుమార్‌రెడ్డికి స్థానం దక్కాలని ఆశిద్దాం.

సంస్కృత విభాగ బీఓఎస్ చైర్‌పర్సన్‌గా శిరీష



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సంస్కృత విభాగ బోర్డు ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్‌పర్సన్‌గా డాక్టర్ గుండ్లపల్లె శిరీషను నియమిస్తూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. 2007లో ఆమె అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. గతంలో సంస్కృత విభాగాధిపతిగా, ఉమెన్ హాస్టల్ డిప్యూటీ వార్డెన్‌గా, నన్నయ వర్సిటీ బీఓఎస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. రెండు పుస్తకాలు, 35 పరిశోధనా పత్రాలు రూపొందించారు. ఆమె పర్యవేక్షణలో నాలుగు పీహెచ్‌డీలు పూర్తయ్యాయి. బీఓఎస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

పాలకమండళ్లలో విశ్వబ్రాహ్మణులకు అవకాశమివ్వండి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఆలయాల పాలక మండళ్లలో విశ్వబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని స్వర్ణాంధ్ర విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు జి.తిరుమలాచారి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మొదటిసారిగా తమ సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల్లో విశ్వబ్రాహ్మణుల పాత్రను గుర్తించి శిల్ప కళాకారుడైన ఆనంద్ సాయికి టీటీడీ బోర్డులో సభ్యుడిగా నియమించడం గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామచంద్రాచారి, రామయ్య ఆచారి, ప్రసాద్‌ఆచారి, కుప్పలింగం ఆచారి, మురళిఆచారి, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కాలేజీలో క్లీన్ అండ్ గ్రీన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కాలేజీలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్నారు. చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీని కలిసిన శ్రీనివాసరెడ్డి

మంగళం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా వి.శ్రీనివాసులురెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టాస్క్‌ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరెడ్డి గతంలో నాయుడుపేట డీఎస్పీగా విధులు నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

డ్రగ్స్ అరికట్టండి



వీసీ కృష్ణమూర్తికి విన్నవిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్‌ను అరికట్టాలని కోరుతూ టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి వర్సిటీ వీసీ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. తిరుపతి వంటి పవిత్ర స్థలంలో, ప్రఖ్యాత సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రగ్స్‌తో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చారు.

వీధిలైట్ల అమరిక పనుల ప్రారంభం



తిరుపతి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులో వీధిలైట్ల అమరిక పనులు అసంపూర్తిగా ఆగిపోయిన విషయమై ఈ నెల 12న ఆంధ్రజ్యోతిలో 'అసంపూర్తిగా వీధి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లైట్ల ఏర్పాటు' శీర్షిన కథనం ప్రచురితమైంది. స్పందించిన టీటీడీ అధికారులు శనివారం పనులు ప్రారంభించారు. వెంకటేశ్వరకాలనీ నుంచి కట్టపుట్టాలమ్మ ఆలయం వరకు తాజా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎల్ఈడీ వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నారు. వారం రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నాయని టీటీడీ అధికారులు తెలిపారు.

బీసీలు ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింతగా రాణించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో ఓబీసీ సంక్షేమ సంఘం పతాకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓబీసీ సంక్షేమ సంఘం ఏర్పాటు ఓబీసీ వర్గాల రక్షణకు, సంక్షేమానికి ఉపయోగపడుతుందన్నారు. బీసీల ఉన్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. హైదరాబాదు ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ రాజ్యాధికారం దిశగా బీసీ వర్గాలు పయనించాలన్నారు. ఓబీసీ మేధావుల ఫోరం కన్వీనర్ వెంకటనారాయణ మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీ వర్గాలకు అన్యాయం జరుగుతోందని అభిప్రాయపడ్డారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీ వర్గాలకూ వర్తింపజేయాలని కోరారు. ఓబీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా తమ సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, నాగరాజు, రవి, విజయ్, మధు, సురేష్, పవన్, గణేష్ పాల్గొన్నారు.



పతాకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కాలువల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి



సుబ్బారెడ్డి నగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(జీవకోన), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో అసంపూర్తిగా ఉన్న కాలువల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. కరకంబాడి రోడ్డులోని సుబ్బారెడ్డినగర్, లీలామహల్ కూడలి, కొర్లకుంట జంక్షన్, బ్లిస్ కూడలి తదితర ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణాలను ఆమె శనివారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, అదేవిధంగా రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా గడువులోపు పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎస్ఈ శ్యాంసుందర్, స్మార్ట్‌సిటీ ఈఈ చంద్రశేఖర్, ఎమ్ఈ తులసికుమార్, డీఈలు రాజు, రమణ, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, టౌన్‌ప్లానింగ్ అధికారులు బాలాజీ, రమణ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

రసాయనాల వాడకాన్ని తగ్గించండి

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని వీలైనంత వరకు నియంత్రించి, రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న రసాయనాల వాడకాన్ని వీలైనంత వరకు నియంత్రించాలన్నారు. రసాయనాల వాడకంతో భూములు నిస్సారమవుతున్నా యని వివరించారు. తద్వారా భవిష్యత్తులో ఆహార ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. అందుకే ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ అధికారులు వివరించారు. శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ పాండురంగ, శ్రీకాళహస్తికి చెందిన రాజేంద్రనాథరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు శశిధర్ రెడ్డి, వేణుగోపాలరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం భేష్



పెరుమాళ్లపల్లెలో సత్యనారాయణ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పాలడుగు సత్యనారాయణ శనివారం పర్యటించారు. అక్కడి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న చెరకు, చిరుధాన్యాల పంటలను పరిశీలించి, భేషుగ్గా ఉన్నాయని కొనియాడారు. అంతకు ముందు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలోని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రా (ఆర్ఏఆర్ఎస్)న్ని సందర్శించారు. ప్రకృతి సేద్యంలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం అమలు చేస్తున్న యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, పంటల సాగు, దిగుబడి వంటి అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశోధనా ఫలితాలను రైతులకు అందించాలని కోరారు. అనంతరం శాస్త్రవేత్తలతో సమావేశమై వారి సమస్యలను ఆరా తీశారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేపట్టిన దీక్ష ఆరంభ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ సుమతి, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్పీ




సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న రవి మనోహరాచారి

తిరుపతి(వైద్యం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, అందుకే వాటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి అన్నారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలో ఆయన వైద్య విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం అడిగినా, సోషల్ మీడియాలో స్నేహం చేసేందుకు ప్రయత్నించినా అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వారితో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా నష్టం జరిగినా లేదా అనుమానిత వ్యక్తుల నుంచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రిటైర్డ్ సివిల్ జడ్జి, నేషనల్ మెంటల్ హెల్త్ రాష్ట్ర చైర్మన్ రాజీవ్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల రూపంలో నేరగాళ్ల మోసాలకు పాల్పడుతుంటారని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైద్య విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేలపట్టు పక్షుల పురిటిల్లు







ప్రత్యేక కథనం దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

పెళ్లయ్యాక మెట్టినింటికి వెళ్లపోయిన ఆడపిల్లలు, పురిటి కోసం మాత్రం పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. పక్షులు కూడా ఈ ఆనవాయితీని పాటిస్తాయని నేలపట్టు నిరూపిస్తోంది. సైబీరియా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, శ్రీలంక, బర్మా, ఇంగ్లండ్, హిమాలయాలు.. దూరాలతో పనిలేదు. జీపీఎస్‌తో పనిలేదు. రెక్కల కష్టమనే వెరపు ఉండదు. ఎగురుకుంటూ ఎగురుకుంటూ నవంబరు నెలకల్లా నేలపట్టుకి చేరుకుంటాయి. పుల్లాపుచికా, గడ్డీగాదం ఏరుకొచ్చి గూళ్లు కట్టుకుంటాయి. గుడ్లు పెట్టి పొదుగుతాయి. పులికాట్ సరస్సులోనూ, పరిసరాల్లోని చెరువులూ, నీటి చెలమలూ, వరికయ్యల్లోనూ నత్తలూ, ఎండ్రకాయలూ, కప్పలూ, చేపలూ, రొయ్యలూ వేటాడి తెచ్చి పిల్లలకు గోరు ముద్దలు చేసి తినిపిస్తాయి. రెక్కలు అమిరి ఎగరగలవని నమ్మకం కుదిరాక తిరుగు ప్రయాణం మొదలు పెడతాయి. ఫిబ్రవరి నుంచి మే నెలదాకా వెనక్కి వలస సాగుతుంది. మళ్లీ వేల కిలోమీటర్లు ఎగిరి వెళ్లిపోతాయి. ఇక్కడ పుట్టిన పిల్లలు ఎక్కడెక్కడో పెరిగి పెద్దయినా, పుట్టింటిని గుర్తు పెట్టుకుని మళ్లీ ఏడాదికంతా నేలపట్టును వెతుక్కుంటూ వస్తాయి. ఏటా దాదాపు 8నుంచి 9 వేల పక్షులు నేలపట్టు విడిదికి చేరుకుంటాయి. గత ఏడాది 8286 పక్షులు రాగా, ఈ ఏడాది ఇప్పటికే 7813 పక్షులు నేలపట్టులో రెక్కలు రెపరెపలాడిస్తున్నాయి. తెల్లని పక్షులు వాలిన పచ్చని చెట్లతో కూడిన నేలపట్టు అందాలను ఆస్వాదించడానికి పర్యాటకులు ఈ సీజన్‌లో పెద్ద సంఖ్యలోనే వస్తున్నారు.

నేలపట్టు రారాజు



పెలికాన్

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో భారీకాయంగల పక్షి పెలికాన్. దాదాపు 15 కిలోల దాకా బరువుంటుంది. దీనిని గూడ బాతు, గూడకొంగ అని స్థానికంగా అంటారు. నేలపట్టులో గ్రే పెలికాన్స్ (ముదుర బూడిద రంగు) పక్షులు ఎక్కువగా విడిది చేస్తాయి. 4 అడుగుల పొడవుతో ఉండే పెలికాన్ రెక్కలు 6 నుండి 7 అడుగుల నిడివి కలిగి ఉంటాయి. మెడ కింద భాగంలో 4 అడుగుల సంచి లాంటిది ఉంటుంది. ఉదయాన్నే లేచి పులికాట్ సరస్సులో వేటకు వెళ్తుంది. 5 కిలోల దాకా బరువుండే చేపలు, పీతలు, కప్పలు వేటాడి మెడకింది సంచిలో వేసుకుని సాయంత్రానికి గూటికి చేరుతుంది. నేలపట్టు చెరువులోని కడప చెట్లమీద గూడు కట్టుకుని రెండు,మూడు గుడ్లు పెడుతుంది. ఆడపక్షి గూటిలో ఉంటే మగపక్షి వేటకు వెళ్తుంది. 30 రోజులపాటు పొదుగుతుంది. పిగిలిన పిల్లల్ని 12 నెలల పాటు పెంచి, రెక్కలొచ్చాక వాటితో కలిసి మరో ప్రాంతానికి వలసపోతుంది. అక్టోబరు చివరలో పెలికాన్‌ల రాకడ మొదలవుతుంది. శ్రీలంక, బర్మా, ఆస్ట్రేలియాల నుంచీ, హిమాలయ ప్రాంతాల నుంచీ పెలికాన్‌లు ప్రతి ఏటా నేలపట్టుకు వలస వస్తాయి. పెలికాన్ జీవిత కాలం పదేళ్లు.

ఇప్పటికే చేరుకున్న పెలికాన్‌ల సంఖ్య: 1316
గత ఏడాది వచ్చినవి: 1014

తొలి అతిథి

విదేశీ విహంగాల్లో మొదటిగా వచ్చే పక్షి ఓపన్ బిల్ స్టార్క్స్. దీనిని నత్తగుల్లకొంగ అంటారు గోధుమ రంగులో నిగ నిగలాడుతూ ఉండే ఈ పక్షి, సంతానోత్పత్తి తరువాత తెలుపు రంగులోకి మారడం విశేషం. రెండు నుండి మూడు గుడ్లు పెట్టి పొదుగు తుంది. నేలపట్టులోనే సంతానోత్పత్తి చేస్తుంది. ఇవి రైతు నేస్తాలు కూడా. వరి పొలాల్లో సంచరించి చీడపీడలను తినేస్తాయి. దాంతో తెగుళ్ళ బెడద తగ్గుతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 1964
గత ఏడాది వచ్చినవి : 3116

నత్తగుల్ల కొంగ



తెల్లకంకణాయి



గుంపులుగా పొదిగే పక్షి

దక్షిణ అమెరికా, వెస్టిండీస్ దేశాల నుంచి అక్టోబరు నెలాఖరు రోజుల్లో నేలపట్టుకు చేరుకున్న పక్షి తెల్లకంకణాయి (వైట్ ఐబీస్). ఏప్రిల్ మొదటి వారం వరకు ఇక్కడే ఉంటాయి. చెరువులోని చెట్ల మీద గుంపులుగా పొదుగుతాయి. ఒక పక్షి రెండు నుంచి ఐదు గుడ్లు పెడుతుంది. చేపలు, కప్పలు, కీటకాలను ఆహారంగా స్వీకరిస్తుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 2458
గత ఏడాది వచ్చినవి : 1274

ఇంగ్లండ్ మిత్రులు

చిన్నస్వాతికొంగలు



ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో ఎక్కువగా నివశించే చిన్నస్వాతికొంగలు (లిటిల్ ఎగ్రేట్స్) నేలపట్టులో అరుదుగా మాత్రమే తారసపడుతుంటాయి. 1994 నుండి మాత్రమే ఇవి నేలపట్టుకు వస్తున్నాయి. లోతు లేని నీళ్ళల్లో ఆహారం సేకరణ చేస్తుంది. చిన్న జీవులను తింటుంది. 3 - 5 వాటి గుడ్లు నీలం, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. 3 నుంచి 5 గుడ్లను ఒక పక్షి పెడుతుంది. మూడు వారాలు పాటు పొదిగి, ఆరు వారాల పాటు పిల్లను పెంచి వాటితో కలిసి ఎగిరి వెళ్ళిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 1686, గత ఏడాది వచ్చినవి: 1562

వెదురుపట్టు స్నేహితులు



ఎర్రకాళ్ల కొంగలు



నేలపట్టుకు సమీపంలోని వెదురుపట్టు నర్సమాంబపుర అగ్రహారంలో ఈ అరుదైన ఎర్రకాళ్ళ కొంగలు (పెయింటెడ్ స్టార్క్స్) విడిది చేస్తాయి. హిమాలయాల్లోనూ, దక్షిణాసియాలోనూ కనిపించే ఈ పక్షులు డిసెంబరులో ఇక్కడికి చేరుకుంటాయి. ఇళ్ల మధ్య ఉండే చింతచెట్ల మీదే వీటి ఆవాసం. పగలంతా పులికాట్ సరస్సులోని శ్రీహరికోట, కొండూరు పాళెం, రాయదొరవు, ఇరకం, పేర్నాడు ప్రాంతాల్లో వేట సాగించి, సాయంత్రానికి వెదురుపట్టుకు చేరుకుంటాయి. చేపలను, పీతలు, రొయ్యలు ఆహారంగా తీసుకుంటాయి. వీటి విసర్జితంతో చెట్లకింద దిబ్బలు పేరుకుంటాయి. ఇది పొలాలకు ఎరువుగా వాడుకుంటారు. స్థానిక ప్రజలతో ఎంతో స్నేహంగా సన్నిహితంగా మెలుగుతాయి. వెదురుపట్టు ప్రజలు వీటి రక్షకులుగా ఉంటారు. ఫిబ్రవరి నుంచి గుడ్లు పొదిగి సంతానోత్పత్తి చేస్తాయి. మే నెలదాకా పిల్లల్ని పెంచి, వెంటతీసుకుని వెళ్లిపోతాయి.

శ్రీలంక నుంచి వచ్చే

నేలపట్టులో చాలా పెద్ద శ్రీలంక నుండి వచ్చే పక్షి లిటిల్ కార్మోరెంట్స్. శరీరం నల్లగా, ఈకలు గోధుమ రంగులో ఉంటాయి. ఒంటరిగా నీటిలో మునుగుతూ ఆహార అన్వేషణ చేస్తుంది. ఒక మీటర్ లోతున్న నీటిలో మాత్రమే ఆహార అన్వేషణ చేస్తుంది. నవంబరు నుండి ఫిబ్రవరి వరకు ఈ జాతి పక్షులు ఇక్కడ సంచరిస్తాయి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదిగి పిల్లలతో కలిసి వెళ్లిపోతాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 41
గత ఏడాది వచ్చినవి : 301

చిన్న నీటి కాకులు



శబరి కొంగ



రాత్రి వేటగాడు

గ్రీకు జాతికి చెందిన నైట్ హెరాన్స్ ను నేలపట్టులో శబరికొంగ అని పిలుస్తారు. పొట్టి మెడ, పొట్టి కాళ్ళు, బూడిద రంగు శరీరం పైన నలుపు కిరీటం గల పక్షి ఇది. రాత్రి వేళ్ళలో వేట సాగిస్తుంది. చిన్న చేపలు, కప్పలు, జలకీటకాలను తింటుంది. పగటి పూట చెట్లు, పొదల్లో విశ్రాంతి తీసుకొంటుంది. 3 నుండి 8 గుడ్లు పెడుతుంది. ఆగ్నేయ ఐరోపా నుంచి ఎగిరి వచ్చి, గుడ్లు పెట్టి, .పొదిగి పిల్లలతో వెళ్లిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 68
గత ఏడాది వచ్చినవి : 593

అరుదైన గెస్ట్

తెడ్డుముక్కు కొంగ



నేలపట్టుకు అరుదైన వలస పక్షి ఇది. నలుపు, పసుపు రంగుల కలిగిన గరిటిలాంటి(స్పూన్ ఆకారంలో) ముక్కు ఉంటుంది. సంతానోత్పత్తి కోసమే నేలపట్టుకు వస్తుంది. రెండు గుడ్లు పెడుతుంది. మంచి నీరు, పులికాట్‌తో పాటు, చెక్ డ్యామ్‌లు, చిత్తడి పొలాల్లో వేట సాగిస్తుంది. చేపలు, రొయ్యలు ఎక్కువగా స్వీకరిస్తుంది. తక్కువ లోతుండే పులికాట్‌లో వీటికి అనువైన ఆహారం లభిస్తుండంతోనే ఇక్కడికి ఏటా పెద్ద సంఖ్యలో వస్తున్నాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 82 , గత ఏడాది వచ్చినవి : 26

నేలపట్టు విడిదికి చేరుకున్న మరికొన్ని పక్షులు...

లార్జ్ ఎగ్రేట్స్(పెద్దస్వాతి కొంగలు) 10, పాండ్ హెరాన్స్(గుడ్డి కొంగలు) 35, .క్యాటిల్ ఎగ్రేట్స్ (పశువుల కొంగలు) 68, ఇండియన్ మోర్ హెరాన్స్(జమ్ముకోళ్ళు) 14, స్పాట్ బిల్ డక్స్ (చుక్కమూతి బాతులు) 10, డాబ్ చిక్స్ (బుడగ బాతులు) 13, కూట్స్(చుక్కకోళ్ళు)12, ఫర్పల్ మోరోహెన్స్(చెంచుకోడి)6, విజిలింగ్ డక్స్(ఈల వేసే చిలువలు) 30 ఉన్నాయి.



తొలిరోజు 1043 క్లెయిమ్‌లు

- ఓటు నమోదు, సవరణకు దరఖాస్తుల స్వీకరణ
- నేడూ అవకాశం



పాకాలలో ఓటరు నుంచి నుంచి క్లెయిమ్‌లు స్వీకరిస్తున్న బీఎల్వోలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రెండో రోజులపాటు బూత్ స్థాయిలో జరిగే ఓటర్ల జాబితా సవరణ శనివారం మొదలైంది. తొలిరోజు ఓటర్ల నమోదు.. సవరణకు 1043 క్లెయిమ్‌లు అందాయి. ఏడు నియోజకవర్గాల పరిధిలోని 2141 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఓటు హక్కు నమోదుకు 469 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇక విదేశాల్లోని వారు 21 మంది ఓటుహక్కు నమోదుకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. అలాగే, ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు 265, ఓటు బదిలీకి, సవరణలకు 288.. ఇలా.. మొత్త 1043 క్లెయిమ్స్ అందాయి. ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు, తొలగింపులు, ఓటర్ల సవరణ, బదిలీ కార్యక్రమం జరగనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 18 ఏళ్ల నిండి ఇంకా ఓటు హక్కు పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా వెలువడనుంది.

రెండు నెలలు తీసుకోకపోయినా
పింఛను ఆగదు

- కొత్త విధానంతో లబ్ధిదారులకు ప్రయోజనం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలు వరసగా పింఛను తీసుకోకపోయినా ఆగదు. మూడో నెలలో మొత్తం కలిపి తీసుకోవచ్చు. ఈ మేరకు రెండు రోజుల కిందట ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చింది. వైసీపీ హయాంలో ప్రతినెలా పింఛను తీసుకోవాల్సిందే. ఒకే నెల అందుబాటులో లేక పోతే తరువాత నెలలో ఆ పింఛను వచ్చేది కాదు. ఈ నిబంధనతో పింఛనుదారులు నష్టపోయారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే 2014- 19లో అనుసరించిన విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ప్రకారం.. ఒక నెలలో తీసుకోకుంటే రెండో నెలలో రెండూ కలిపి.. ఒక వేళ రెండో నెలలోనూ తీసుకోలేకుంటే మూడో నెలలో మూడు పింఛన్లు కలిపి తీసుకోవచ్చు. దీనివల్ల తిరుపతి జిల్లాలో 2,65,488 మంది పింఛను లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది. లబ్ధిదారుల్లో కొంతమంది అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉంటున్నారు. కొందరు కుమారుడు, కుమార్తె ఇళ్ల వద్ద ఉంటున్నారు. ఇంకొందరు ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. వీరంతా చెన్నై, బెంగళూరు, పక్క జిల్లాల నుంచి రావాల్సి వస్తోంది. ఇలా దూరప్రాంతాల్లో ఉండేవారు మూడో నెలల్లో ఏదో ఒకనెల వచ్చి పింఛను తీసుకునే వెసులుబాటు ఉంది. ఈ నిర్ణయం పేదలకు పెద్ద భరోసా లాంటిదని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గత నెలలో 1,499 మంది పింఛను తీసుకోలేదని గుర్తుచేశారు. కొత్త పింఛను విధానం వల్ల దూరప్రాంతాల్లోని వారికి దారి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు.

వచ్చే నెల నుంచి స్పౌజ్ పెన్షన్

డిసెంబరు నుంచి స్పౌజ్ పెన్షన్‌ను అమలు చేస్తూ ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. ఈ మేరకు పెన్షనుదారుల్లో భార్య లేదా భర్త చనిపోతే.. ఆటోమేటిగ్గా ఆ దంపతుల్లో మరొకరు లబ్ధిదారు అవుతారు. దీనికోసం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు డెత్ సర్టిఫికెట్ అందజేయాలి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,731 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,890 మంది తలనీలాలు సమర్పించారు.

మా కుటుంబం రాజకీయాల్లోకి రావడంపై
కాలమే నిర్ణయిస్తుంది

- మాజీ మంత్రి అరుణకుమారి



చంద్రగిరిలో సినిమా తిలకిస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి తదితరులు

చంద్రగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'నేను రాజకీయాల నుంచి రిటైరయ్యాను. మా కుటుంబం రాజకీయాల్లోకి రావడమనేది కాలమే నిర్ణయిస్తుంది' అని మాజీ మంత్రి అరుణకుమారి వ్యాఖ్యానించారు. గల్లా కుటుంబం మళ్లీ రాజకీయాల్లోకి రావడంపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. తన మనవడు గల్లా అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' సినిమాను శనివారం ఆమె చంద్రగిరిలోని ఎస్వీ సినిమా థియేటర్‌లో తిలకించారు. 'ఈ సినిమాలో సనాతన ధర్మం, స్వేచ్ఛ, మాతృత్వం ఎలా ఉంటుందో చూపించారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు చూడదగ్గ సినిమా. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. అన్ని వర్గాల ప్రజలు సినిమాను ఆదరించి, గల్లా అశోక్‌ను ఆశీర్వదించాలి' అని ఆమె కోరారు. చిన్న వయసులోనే అశోక్ సూపర్ స్టార్ కృష్ణ, మేనమామ మహేష్‌బాబుతో నటించారని ఆమె గుర్తు చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, నాయకులు బడి సుధాయాదవ్, ముడిపల్లి సురేష్‌రెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, ఎల్లప్పరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ వాసు, జయచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు మస్తాన్, చేగు ప్రశాంత్ గుప్తా, మాధవరెడ్డి, గల్లా అభిమానులు రాజగోపాల్, ప్రదీప్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకాళహస్తి హస్తకళలు





దశరథాచారి స్టాల్ - సుధీర్ కలంకారీ చిత్రాలు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తివాసులు ఏర్పాటు చేసిన దారువు బొమ్మలు, కలంకారీ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని క్రాఫ్ట్ మ్యూజియంలో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి కొయ్యబొమ్మలను ప్రదర్శించారు. కలంకారీ కళాకారుడు సుధీర్ కలంకారీ చిత్రాలను ప్రదర్శించారు. వివిధ వస్త్రాలపై దేవతామూర్తులు, పురాణ ఇతిహాస రూపాలను పురాణగాథలను ప్రతిబింబించేలా తయారు చేశారు. కూరగాయలు, మొక్కల నుంచి తయారు చేసిన ప్రకృతి సిద్ధమైన రంగులను వినియోగించారు.

ఆయుర్వేద మందుల దుకాణాలపై దాడులు

- అనుమతిలేని మందుల స్వాధీనం
- లైసెన్సు లేని ధన్వంతరీ చికిత్సాలయం సీజ్



అనుమతి లేకుండా విక్రయిస్తున్న మందులను సీజ్ చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఆయుర్వేద మందుల దుకాణాలపై విజిలెన్స్, డ్రగ్ కంట్రోల్, ఆయుష్ అధికారులు శనివారం దాడులు చేశారు. అనుమతిలేని మందులు విక్రయిస్తున్నారని, ఆయుర్వేద మందుల స్థానంలో ఇంగ్లిషు మందులు విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారని కొంతకాలంగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేశారు. విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, చంద్రశేఖర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి, ఆయుష్ డాక్టర్ విజయకుమార్ రెండు బృందాలుగా విడిపోయి స్విమ్స్ సర్కిల్, కోదండరామాలయం రోడ్డు, ఇతర ప్రాంతాల్లోని ఆయుర్వేద మందుల దుకాణాలను తనిఖీ చేశారు. కోదండరామాలయం రోడ్డులోని ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయానికి లైసెన్స్ లేకపోవడంతో సీజ్ చేశారు. కోదండరామాలయం దక్షిణ మాడ వీధిలోని అమృత ఆయుర్వేద మెడికల్స్‌లో అనుమతి లేని మందులు విక్రయిస్తున్నారంటూ మొత్తం స్టాక్‌ను స్వాధీనం చేసుకుని, నోటీసు అందజేశారు. అనుమతిలేని మందులు విక్రయించినా, దుకాణాలు నిర్వహించినా చర్యలు తప్పవని విజిలెన్సు సీఐ వెంకటరవి హెచ్చరించారు.

నేడే రూరల్ ప్రీమియర్ లీగ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూరల్ ప్రీమియర్ లీగ్ 2024 పోటీలు ఆదివారం ఎస్వీయూ మైదానంలో నిర్వహించనున్నారు. వాలీబాల్ పోటీలకు 300మంది పురుషులు, త్రోబాల్ పోటీలకు 100మంది మహిళలు తిరుపతి చేరుకున్నారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు వచ్చేనెల మొదటి వారంలో విజయవాడలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారు. అక్కడ విజయం సాధించిన జట్లు డిసెంబరు 28న కోయంబత్తూరులో జరిగే అంతిమపోరులో ప్రాతినిధ్యం వహిస్తారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీలో 2, 4వ సెమిస్టర్‌కు సంబంధించిన పలు కోర్సుల ఫలితాలు విడుదలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

నాకు రాదు... నేను మాట్లాడను..

పది నిమిషాలే ఉంటా... మీరు ఏమైనా చేసుకోండి

మండల మీట్‌లో వైద్యాధికారి నిర్లక్ష్య సమాధానం



డాక్టర్‌ను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి

దొరవారిసత్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేను మాట్లాడను... నాకు రాదు... నేను పది నిమిషాలే ఉంటా... మీరు ఏమైనా చేసుకోండి... అంటూ వైద్యాధికారి వింత, నిర్లక్ష్యపు సమాధానాలతో అధికారులు... ప్రజాప్రతినిధులు నోరేళ్లబెట్టారు. దొరవారిసత్రం మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఎం.చంద్రకళ సమావేశం మధ్యలో వచ్చారు. అప్పటికే శాఖలవారీగా సమీక్ష జరుగుతుండడంతో ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ వైద్యాధికారిని పిలిచారు. సభావేదిక వద్దకు వెళ్లిన డాక్టర్ నేను మాట్లాడను... నాకు రాదు... అని జవాబు ఇచ్చారు. వేదికపైనే ఉన్న ఎంపీపీ భర్త, వైఎస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి మైక్ అందుకుని మీ శాఖ అందించే సేవల గురించే కదా చెప్పమంటోంది, మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇంతలో ఆమె వేదిక దిగి వెళ్లిపోయారు. నేను పది నిమిషాలే ఉంటాను అంటూ.. కాసేపు కూర్చొని సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. ఆమె తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో గోవర్ధన్‌ను ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ కోరారు. ఇక అక్కరపాక సర్పంచు ప్రభాకరెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు బాగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో సేవలు అందించడంలేదని పలువురు సర్పంచులు మండిపడ్డారు. మీజూరు, తొగరాముడి గ్రామాల్లో రైతులకు ఎరువులు అందించడం లేదని తొగరాముడి సర్పంచు ప్రసాద నాయుడు వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నించారు. వేణుంబాక పాఠశాలకు ప్రభుత్వం అందించిన బెల్టులు, షూ, బ్యాగ్‌లు విద్యార్థులకు ఇవ్వలేదని వేణుంబాక ఎంపీటీసీ మస్తాన్ అధికారుల దృష్టికి తెచ్చారు.

సాదాసీదాగా మండల మీట్

వాకాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. వాకాడులోని స్త్రీశక్తి భవనంలో శనివారం కొడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ రౌతు రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఐసీడీఎస్ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి కోరారు. స్వర్ణముఖి బ్యారేజీ గేట్ల మరమ్మతులు చేపట్టి ఆధునీకరించాలని కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావుకు సూచించారు.

పుత్తూరు వార్తలు

శరవేగంగా హైవోల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు

పుత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జనవరి నెలాఖరులోగా హైవోల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. తిరుపతిలోనే 40 ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న వేసవి నాటికి వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నారు. అయిదు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ల లోపాల మీద దృష్టి పెట్టామన్నారు. 35 శాతం నష్టాలను తగ్గించామన్నారు. మోటార్లకు కెపాసిటర్లను, ఫ్యూజ్‌లను అవగాహనతో పెట్టుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం గుర్తించిన ఈఎస్ఎల్ కంపెనీ వస్తువులు కొంటే కరెంటుతో పాటు బిల్లు కూడా ఆదా అవుతుందన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద కిలో వాట్ ఉత్పత్తికి రూ.30వేలు, రెండుకిలో వాట్లకు రూ.60వేలు, మూడు కిలో వాట్లకు రూ.72 వేలు సబ్సిడీని పొందవచ్చన్నారు. సమావేశంలో పుత్తూరు డీఈ ఆశీర్వాదం, ఏడీఈ శంకరయ్య, ఏఈలు జయసాయి, రవిచంద్రన్ పాల్గొన్నారు.

పుత్తూరులో బీజేపీ నేతల సంబరాలు

పుత్తూరు అర్బన్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ విజయంతో పుత్తూరులో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నాయకులు పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.బాబు, అసెంబ్లీ ఇంచార్జ్ హరిబాబు నేతృత్వంలో జరిగిన సంబరాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహదేవరాయలు, రమణ, నాగరాజు, వెంకటేశులు, బి.వి.రావు, సిద్ధాంతి, శేఖర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పుత్తూరు టౌన్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలపై శంఖారావాన్ని పూరించాలని సీఐటీయూ కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. 26న జరిగే కలెక్టర్ ధర్నాను విజయవంతం చేయాలని పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నారాయణవనం మండల సీఐటీయూ కార్యదర్శి మునిశంకర్, నాయకులు విజయకుమారి, లక్ష్మి, లలిత, అంబికా, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



చిన్నారులకు వినికిడి యంత్రాలను అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జానకి

పుత్తూరు అర్బన్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులను ఆదరించాలని జూనియర్ సివిల్ జడ్జి జానకి పేర్కొన్నారు. శనివారం పుత్తూరు న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో మదర్ తెరిస్సా పాఠశాలలో ప్రత్యేక ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. నగరి ఏరియా ఆసుపత్రి స్పీచ్ థెరపిస్ట్ శ్రీధర్ వివిధ సూచనలు చేశారు. అనంతరం చిన్నారులకు జానకి వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు పావని, జయంతి, పాఠశాల ప్రిన్సిపాల్ శివయ్య, ఉపాధ్యాయులు జయశేఖర రిజెల్, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం పాల్గొన్నారు.

తపాలా ఖాతాల మహామేళా ప్రారంభం



ఖాతాలను ప్రారంభిస్తున్న సహాయ సూపరింటెండెంట్, టీడీపీ నాయకులు

వడమాలపేట, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల సబ్సిడీ పొందాలంటే తపాలా శాఖా ఖాతాలు తప్పనిసరిగా ఉండాలని ఆశాఖ సహాయ సూపరింటెండెంట్ ఆర్ముగం చెప్పారు. శనివారం వడమాలపేటలో తపాలాశాఖ ఖాతాల మహామేళాలో వివిధ పోస్టల్ ఖాతాలను చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ముగం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందంతో భవిష్యత్తులో వివిధ పథకాల సబ్సిడీ ద్వారా ఆర్థిక లావాదేవీలు పోస్టల్‌శాఖ ద్వారా లబ్ధిదారులకు అందుతున్నారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ కిషోర్, పోస్ట్‌మెన్లు, టీడీపీ నాయకులు చిరంజీవి, అదెయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సూళ్లూరుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ ఆర్.శేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

26 నుంచి ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయంపు, కోటంబేడు, పెరిమిడి, ఊట్లపల్లి గ్రామ సచివాలయాల వద్ద ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో వినీల్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నెర్రికాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకుకు ఎత్తిపోతలు



మోటార్ల ద్వారా ఎస్ఎస్ ట్యాంకును నింపుతున్న దృశ్యం

సూళ్లూరుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు అందుబాటులో లేదు. ఫలితంగా ఏటా నీటి ఎద్దడి తప్పడం లేదు. సూళ్లూరుపేట పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు 2006లో పిండిపాలెం వద్దనున్న కోటపోలూరు చెరువులో రూ.6 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు (ఎస్ఎస్)ను నిర్మించారు. గత రెండేళ్లగా ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి ఎస్ఎస్ ట్యాంకు కూడా నీరులేక ఎండుముఖం పట్టేస్థాయికి చేరింది. 750 మిలియన్ లీటర్ల సామర్థ్యం ఉన్న ఎస్ఎస్ ట్యాంకు ప్రస్తుతం 65 మిలియన్ లీటర్ల స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు నీటి ఎద్దడి నివారణపై దృష్టిసారించారు. నెర్రికాలువలో మోటార్లు పెట్టి ఎత్తిపోతల ద్వారా ఎస్ఎస్ ట్యాంకును నింపేందుకు అధికారులు నడుం బిగించారు. ఇటీవల జిల్లాలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కాళంగి నదితో పాటు దానికి అనుసంధానంగా ఉన్న నెర్రికాలువకూ భారీగా వర్షపునీరు చేరింది. మున్సిపాలిటీ అధికారులు నెర్రికాలువలో నాలుగు 7.5 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపుతున్నారు.

యువకుడి హత్య కేసులో ఐదుగురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఖాదర్‌బాషా

వాకాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలోని దుగరాజపట్నం వద్ద వారం రోజుల క్రితం జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ ఖాదర్‌బాషా శనివారం మీడియాకు వెల్లడించారు. గూడూరు పట్టణంలోని శివాలయం వీధికి చెందిన కొండా అనిత్‌కుమార్‌రెడ్డి(25), అరుందతిపాళేనికి చెందిన కనుపూరు శ్రీహరి(జెమినీ) స్నేహితులు. శ్రీహరి భార్యతో అనిత్‌కుమార్‌రెడ్డి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీహరి తన స్నేహితులైన బాకం నరేష్, పేర్నాటి చెందు, షేక్ కాలేషా, షేక్ జావిద్‌తో కలిసి అనిత్‌కుమార్‌రెడ్డిని హత్య చేసేందుకు ప్లాన్ వేశారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం మద్యం తాగుదామని అనిత్‌కుమార్‌రెడ్డి, శ్రీహరి ద్విచక్ర వాహనంలో చిల్లకూరు మండలం చుట్టుగుంట హైవే రోడ్డు పక్కన ఉన్న ఓ దాబా వెళ్లారు. అప్పటికే శ్రీహరి స్నేహితులు దాబా వద్ద వేచి చూస్తున్నారు. అందరూ కలిసి మద్యం తాగారు. అందరూ కలిసి ఒక్కసారిగా అనిత్‌కుమార్‌రెడ్డిపై కర్రలతో దాడిచేసి హత్యచేశారు. మృతి చెందిన అనిత్ కుమార్‌రెడ్డిని కారు డిక్కీలో వేసుకొని వాకాడు మండలంలోని దుగరాజపట్నం దక్షిణ పల్లం సమీప పొలాల్లో పడేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు పత్రికల్లో వార్త రావడంతో మృతుడు తండ్రి ఉదయకుమార్‌రెడ్డి తమ బంధువులతో వచ్చి శవాన్ని చూసి తన కొడుకు అనిత్‌కుమార్‌రెడ్డిగా నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వాకాడు సీఐ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం చిల్లకూరు దాబా వద్ద ముగ్గురిని, నెల్లూరులో ఇద్దరిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన ఐదు కర్రలు, ఒక ట్రిమ్మర్, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం నిందితులను కోర్టులో పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు, కోట, చిట్టమూరు ఎస్ఐలు నాగబాబు, పవన్, చినబలరామయ్య పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

పుత్తూరులో ఘటన



వస్త్రదుకాణంలో అగ్నికీలలు.. దగ్ధమైన వస్త్రాలు, సామగ్రి

పుత్తూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులోని కె.వి.టెక్స్‌టైల్స్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. శనివారం రాత్రి 9 గంటలకు దుకాణం నుంచి అగ్ని కీలలు ఎగసి పడుతుండటం చూసి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. స్టేషన్ అధికారి నేతాజి, సిబ్బందితో కలిసి అగ్నిమాపక వాహనంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. దుకాణం మూసి ఉండటంతో షట్టర్‌ను తొలగించడం సిబ్బందికి కొంత ఇబ్బందికరంగా మారింది. ఆ వెంటనే మంటలను అదుపు చేశారు. వస్త్ర దుకాణం ముందు భాగంలోని దుస్తులు, టేబుళ్లు ఇతర పరికరాలు కాలిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను తొలగించి.. ఆ తర్వాత పునరుద్ధరించారు. రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని దుకాణ యజమాని వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం రూ.3.50 లక్షల వరకు నష్టం అంచనా విలువను ధ్రువీకరించారు. అగ్నిమాపక సిబ్బంది నాగేశ్వరరావు, విశ్వనాథశెట్టి, మునిప్రతాప్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ నష్టాన్ని అదుపు చేయగలిగారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థి తల్లికి చెక్కు అందజేస్తున్న జలీల్ అహ్మద్, టీడీపీ నేతలు

కోట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని కురుగొండ కరుణను గ్రీన్ ఫౌండేషన్ ఆదుకుంది. కరుణ ఇంటర్ పూర్తిచేసి నీట్‌కు శిక్షణ పొందుతోంది. ఉన్నత చదువులకు ఆర్థిక సాయం చేయాలని గ్రీన్ ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో ఆ సంస్థ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ విద్యార్థినికి రూ.20వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, నౌషాద్, బాబు పాల్గొన్నారు.

భూమి కబ్జా చేశారంటూ ఆందోళన

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన జమీలా తన భూమిని కబ్జా చేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ కుటుంబసభ్యులతో కలిసి కోట తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. జమీలాకు చిట్టేడులో 71 సెంట్ల పట్టాభూమి, పక్కనే మరో 41 సెంట్ల అసైన్‌మెంట్ భూమి ఉంది. చిట్టేడు గ్రామానికి చెందిన ఫయాజ్ తమ భూమిని సాగు చేస్తూ కౌలు సక్రమంగా ఇవ్వడం లేదని, అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పింది. అతని నుంచి తన భూమిని ఇప్పించాలంటూ సీపీఐ నాయకులతో కసిఇ తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టింది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని తహసీల్దారు చెప్పడంతో ఆందోళన విరమించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హుస్సేన్, షానవాజ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆదిశేషయ్యపై నెల్లూరుకు చెందిన వడ్డీ వ్యాపారులు రాజ, ఆయన అనుచరులు ముగ్గురు దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్థిక లావాదేవీల విషయమై ఆదిశేషయ్యపై వడ్డీ వ్యాపారులు దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

అపార్ సేవల కేంద్రం పరిశీలన

ఓజిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓజిలి సచివాయలంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అపార్(ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిష్టర్) సేవల కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి శనివారం పరిశీలించారు. ఆధార్ నమోదులో జరుగుతున్న పొరపాట్ల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అపార్ నమోదు చేపట్టారు. మండలంలో ఓజిలితో పాటు కరబల్లవోలు సచివాలయంలో అపార్ సేవలు కొనసాగుతున్నాయి. ఓజిలిలో జరుగుతున్న అపార్ నమోదును పరిశీలించిన డీపీవో సుశీలాదేవి అక్కడి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా, ఓజిలి, కరబల్లవోలు సచివాలయాల్లో కొనసాగుతున్న అపార్ సేవలు ఆది, సోమవారం ఉండవని, తిరిగి మంగళవారం నుంచి 29వ తేదీ వరకు తిరిగి యధావిధిగా కొనసాగుతాయని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో ఫొటో ఎగ్జిబిషన్

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లు ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు గోవిందు మాధవయ్య, శోభారాణి, రవీంద్రరెడ్డి తదితరులు ఎగ్జిబిషన్ పరిశీలించారు. అదే విధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డాక్టర్ హెచ్ఆర్ స్మార్ట్‌విజన్ నెల్లూరు ఆస్పత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ సందీప్ అధ్యాపకులకు కంటి పరీక్షలు చేశారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు అర్బన్/నాయుడుపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని చెన్నూరు కాపువీధిలో కాపురం ఉంటున్న సులోచనమ్మ పొరుగింటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆమె మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు. ● నాయుడు పేట పట్టణంలోని గిండివారితోటలో నివాసం ఉంటున్న సావిత్రమ్మ శనివారం ఉదయం ఇంటి ముందర ముగ్గు వేస్తుండగా ఆమె మెడలో నుంచి 3 సవర్ల సరుడును గుర్తుతెలియని యువకుడు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

పదో తరగతి విద్యార్థులు విద్యా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి

చిల్లకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు విద్యాసామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని డీఈవో ఎంవీఎన్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుల్లో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించి వారి సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, కోడిగుడ్లు, చిక్కీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చంద్ర, శ్రీనివాసులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యందుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఈఎస్ ఊహశ్రీ

వెంకటగిరి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల యజమానులు బెల్టు దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఊహశ్రీ అన్నారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం అరవపాళెం, నాగులగుంటపాళెం, బ్యాండుపాళెం గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటు సారా కోసం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్టు దుకాణాలు నిర్వహించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచి తరచూ దాడులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కొనుగోలుకూ బిల్లు ఇవ్వాలి

వెంకటగిరి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు చేస్తే ప్రతి వస్తువుకూ బిల్లులు అందజేయాలని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏ సుచేంద్రప్రసాద్, వెంకటగిరి ఏడీఏ నాగార్జున సాగర్ అన్నారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కల్తీ ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి శాశ్వత భవనం నిర్మించండి

వాకాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌జేఆర్ గిరిజన కాలనీలో అంగన్‌వాడీకి శాశ్వత భవనాన్ని నిర్మించాలని శనివారం మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్ ఎంపీడీవో అన్నపూర్ణరావుకు వినతిపత్రం అందజేశారు.

ఐపీఎల్ వేలంలో తిరుపతి కుర్రాడు



తిరుపతి(క్రీడలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ పోటీల వేలం పాటకు తిరుపతి యువకుడు యద్దెల గిరీష్‌కుమార్‌రెడ్డికి స్థానం దక్కింది. ఆది, సోమవారాల్లో సౌదీ అరేబియాలో జరగనున్న ఐపీఎల్ వేలం పాటలో ఈ కుర్రాడిని ఏ టీం దక్కించుకుంటుందో వేచి చూడాల్సి ఉంది. రామచంద్రాపురం మండలం అనుపల్లె పంచాయతీ నూతిగుంటపల్లెకు చెందిన యద్దెల చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు వై.గిరీష్‌కుమార్‌రెడ్డి. బాగా చదువుకున్నాడు. క్రికెట్‌పై ఆసక్తి ఉండడంతో ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుని ఫాస్ట్‌బౌలర్‌గా గుర్తింపు పొందాడు. స్కూల్, జిల్లా, జోనల్స్, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రాతినిథ్యం వహించాడు. ఆంధ్రా ప్రీమియర్‌లీగ్‌కు ఎంపికయ్యాడు. జూలైలో జరిగిన ఏపీపీఎల్ టోర్నీలోని నాలుగు మ్యాచుల్లో తొమ్మిది వికెట్లు తీసి రాణించాడు. ఐపీఎల్ ఆక్షన్ ఎంపిక కోసం జరిగిన పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి స్థానం దక్కించుకున్నాడు. ఏపీ నుంచి ఎంపికైన 11మందిలో స్థానం దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో ఇతడికి స్థానం దక్కాలని ఆశిద్దాం.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఆదివారం కూడా పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉన్నా, తప్పులు ఉన్నా సరిదిద్దుకోవచ్చునన్నారు.

హై టెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణం నిలిపివేత

పెళ్లకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి వద్ద పంట కాలువపై చేపట్టిన హైటెన్షన్ విద్యుత్ టవర్ నిర్మాణ పనులను ఆపేశారు. 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా ఉన్న హైఓల్టేజ్ విద్యుత్ తీగల ఎత్తు పెంచేందుకు టవర్ నిర్మాణ పనులకు గుంతలను తవ్వారు. దీనివల్లఇబ్బందులు ఎదురవుతాయని రైతులు విన్నవించుకున్నారు. శనివారం కాంట్రాక్టర్ ఆ గుంతలను పూడ్చి వేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా చెంచుకుమార్



ఓజిలి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కోడిపిల్ల చెంచుకుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్ ఆయనను ఎంపిక చేసింది. ఆదివారం విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర దినోత్సవ కార్యక్రమంలో స్టేట్ బెస్ట్ సోషల్ స్టడీస్ టీచర్ అవార్డు-2024ను చెంచుకుమార్ అందుకోనున్నారు. ఈ మేరకు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, సురేష్ నుంచి చెంచుకుమార్‌కు ఆహ్వానం అందింది.

మంచినీళ్లిచ్చి దాహార్తి తీర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, వేదికపై చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(జడ్పీ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. కొన్నిచోట్ల నీటి ట్యాంకులు శిథిలావ్యవస్థ చేరాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఒసారి తాగునీరు ఇస్తున్నారు. కనీసం రెండు రోజులకు ఒకసారి ఇచ్చేలా చూడండి. గిరిజన ప్రాంతాల్లో క్లోరినేషన్ లేక ఎర్రనీళ్లు తాగుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించి, వాళ్ల ఆరోగ్యాలను కాపాడాలి'... అంటూ జడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలతో పాటు జడ్పీటీసీ సభ్యులు కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశం శనివారం జరిగింది. గ్రామీణ నీటి సరఫరా, తాగునీటి ఇబ్బందులపై సభ్యులు చర్చించారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రైతులంతా పంటలు వేసుకుంటున్నారని, కానీ చెరువులకు నీళ్లు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు తెలియచేయడం లేదన్నారు. వెంటనే రైతులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. జడ్పీ సమావేశంలో సాగునీరు, వ్యవసాయం తదితర అంశాలు ఉన్నప్పటికీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సమావేశానికి రాకపోవడంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సమావేశాలకు కారణం లేకుండా అధికారులు గైర్హాజరైతే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం గ్రామాలకు ఇవ్వకుండా ప్రభుత్వమే వాడేసుకొని ఇబ్బంది పెట్టిందన్నారు.

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన



ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన తహసీల్దార్ నరసింహరావు, ప్రిన్సిపాల్ సురేష్

సూళ్లూరుపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో శనివారం ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు నరసింహరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

శాస్త్రోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన



శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం శాస్త్రోక్తంగా లక్ష బిల్వ, కుంకుమార్చన వేడుకలను నిర్వహించారు.. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్పం నిర్వహించారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల అర్చనను సాగించారు. సాయంత్రం నాలుగో కాలం అర్చన చేశారు. గురుకుల్ రాజేష్ గురుకుల్, వేదపండితులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విక్రమ్ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపారు. శ్రీకాళహస్తి సత్యసేవ సమితి నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన జాహ్నవి, గాయత్రి, జ్ఞాపిక, స్రవంతి, గుణవర్ధన్, యశ్విని ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని శుక్రవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్త్రీలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ దీనదయాల్ అన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శనివార స్త్రీహింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. స్వీవెన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్‌కుమార్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివశంకర్‌నాయక్, నరసింహరావు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

'మహా' విజయంపై బీజేపీ శ్రేణుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఎన్డీయే విజయం అపూర్వమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పాతబస్టాండు కూడలి వద్ద మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, కొండేటి గోపాల్, కుప్ప ప్రసాద్, నాగరాజు, కృష్ణయ్య పుల్లయ్య, గోవర్ధన్, అమర్‌నాథ్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్‌పై విద్యార్థులకు అవగాహన



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అయోడిన్‌పై ప్రజా ప్రగతి ట్రస్టు శనివారం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ట్రస్టు సమన్వయకర్తలు సుబ్రమణ్యం, మునిరాజాలు మాట్లాడుతూ అయోడిన్ వాడకం హెచ్చుతగ్గుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన ఎనిమిది మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరగా స్వర్ణ పంచాయతీ సర్వే పూర్తి చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వర్ణ పంచాయతీ సర్వేత్వరితగతిన పూర్తి చేయాలని సూళ్ళూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని శనివారం తనిఖీ చేసి స్వర్ణ పంచాయతీ సర్వేపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 పంచాయతీలలో 9060 ఇళ్లను సర్వేచేయవలసి ఉండగా ఇప్పటివరకు 1290 ఇళ్లను సర్వే చేశారన్నారు. కార్యక్రమంలో ఈవోపీర్డి రాజశేఖర్, కార్యదర్శి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేటీరోడ్డులో ఆక్రమణల తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కేటీరోడ్డులో ఆక్రమణలను శనివారం తొలగించారు. శ్రీకాళహస్తి-తడ రోడ్డులోని పచ్చాలమ్మ కాలనీ దగ్గర ఆర్‌అండ్‌బీ కేటీ రోడ్డు పాఠశాల ప్రహరీ దగ్గర స్థలాన్ని కొందరు ఆక్రమించి గదులు నిర్మించుకున్నారు. వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఆక్రమణలపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదుల చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబు, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంఈవో రవీంద్రనాథ్, వీర్వోలు, కార్యదర్శులతో కలసి జేసీబీ ద్వారా ఆక్రమణలు తొలగించారు.

26న జిల్లా కేంద్రాల ముట్టడికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు చెప్పారు. పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం వ్యవసాయ కార్మికసంఘం, రైతు సంఘాల ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మోదీ పాలనలో వ్యవసాయ, కార్మిక రంగాలు కుదేలయ్యాయని మండిపడ్డారు. 26న జరిగే నిరసన విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దాసరి జనార్దన్, వందవాసి నాగరాజు, గంధం మణి, గురవమ్మ, బాలకృష్ణ, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతా

● శాప్ చైర్మన్ రవినాయుడు



జూడో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

రేణిగుంట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉమ్మడి అంతర్ జిల్లాల అండర్-19 జూడో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పోర్ట్స్ పాలసీ అమలుకు ముఖ్యమంత్రి చంద్రాబాబు ఆమోదం తెలిపారన్నారు. ఒలంపిక్ స్థాయిలో రాష్ట్ర క్రీడాకారులు రాణించేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచడంతోపాటు జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులకు యాభై శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తిరుపతిలో క్రీడా వికాస్ కేంద్రాలు, మల్టిపర్పస్ స్టేడియాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్, డీఈవో విశ్వనాథ్ డీవైఈవో బాలాజీ, విష్ణువర్ధన్, రేఖ, కోచ్‌లు ప్రతాప్ రెడ్డి, జయరామయ్య పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యవేడులో డిసెంబరు 1, 2వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుల్లయ్య, దాసరి జనార్థన్, గంధం మణి, పెనగడం గురవయ్య, హేమలత పాల్గొన్నారు. ●సత్యవేడు: సత్యవేడులో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్థన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయం ఆవరణలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగలాపురం, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్రవాహన దారుడు మృతి చెందాడు. వివరాలిలా.. శనివారం ఊత్తుకోట నుంచి నాగలాపురం వస్తూ బొలెరో వాహనాన్ని డ్రయివర్ కారని గ్రామం వద్ద రోడ్డు పక్క ఆపాడు. అదే సమయంలో పాలవాక్కంకు చెందిన విశ్వనాథరెడ్డి (75) ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వస్తూ ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో విశ్వనాథరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. బొలేరో డ్రైవర్ సమాచారం మేరకు హైవే పోలీసులు అతడ్ని నాగలాపురం ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత నగరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ విశ్వనాథరెడ్డి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆటోను ఢీకొన్న కారు :ఐదుగురికి గాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. తిరుపతి నుంచి ఆటో శ్రీకాళహస్తి వస్తుండగా వీఎంపల్లి వద్ద నాయుడుపేట నుంచి బెంగళూరు వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న మధుసూదన్, సరస్వతి, హైమావతి, సన్నిత్ ,బాలకృష్ణ గాయపడ్డారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి శివారులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అయ్యలనాడు చెరువు వరవ కాలువ భూమిపై నిర్మించిన మూడు అక్రమ నిర్మాణాలను అధికారులు శనివారం కూల్చివేశారు. పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ గ్యారేజీప్రహరికి వెనుకవైపు వరవ కాలువ భూమి ఉంది. ఇక్కడ కాలువ స్థలంలో మూడు అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు పురపాలక సంఘ అధికారులు గుర్తించారు. యజమానులు రికార్డులు చూపకపోవడంతో టౌన్‌ప్లానింగ్ అధికారి శారద ,టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తుతో నిర్మాణాలను తొలగించారు.

ఎరువు, పురుగు మందు దుకాణాల్లో తనిఖీ

పిచ్చాటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వివిధ ఎరువులు,పురుగు మందుల దుకాణాల్లో శనివారం అధికారులు తనిఖీలు చేపట్టారు. శ్రీకాళహస్తి సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతరం చొరవతో తల్లిదండ్రుల వద్దకు బాలుడు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడు ఓ స్వచ్ఛంద సంస్థ చొరవతో తల్లిదండ్రులను చేరుకున్నాడు. పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ వద్ద ఓ బాలుడు దారితప్పి తిరుగుతున్నాడని యువతరం సేవాసమితి సభ్యులు తెలుసుకున్నారు. వారు వెంటనే ఆ బాలుడిని పట్టణ నిరాశ్రయుల వసతిగృహానికి తీసుకువచ్చారు. బాలుని వివరాలతో వివిధ వాట్సప్ గ్రూపుల్లో పోస్టు పెట్టారు. దీంతో ఏర్పేడుకు చెందిన వారు బాలుడి తల్లిదండ్రులని గుర్తించారు. శనివారం వారికి బాలుడ్ని వారికి అప్పగించారు.

వేరుశనగ సాగుపై రైతులకు శిక్షణ

రేణిగుంట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : చైతన్యపురంలోని కేవీకేలో శనివారం రాష్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేరుశనగ సాగులో మెలకువలపై శిక్షణ ఇచ్చారు. పిచ్చాటూరు మండలంలోని అడవి కోడియంబేడు, కారూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కేవీకె సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన

వరదయ్యపాళెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం సేల్స్‌ట్యాక్స్ శ్రీసిటీ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో జీఎస్టీలు చెల్లించాలని కోరారు. అధికారులు ఇందిరా ప్రియదర్శిని, షేక్ షరీఫ్, ఆనంద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: సత్యసాయిబాబా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి సేవాసమితి నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. రుష్వి, కుసుమాంజలి మొదటి బహుమతి, జోష్న, వేదాంత్ రెండవ బహుమతి, డింపుల్, దిలీప్‌కుమార్ మూడవ బహుమతిని సాధించారు. ప్రిన్సిపాల్ రూపాదేవి ఆ విద్యార్థులను అభినందించారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశదీపం శాస్త్రోక్తంగా వెలిగించారు. తొలుత ఆలయ వేదపండితులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. ఈవో బాపిరెడ్డి దంపతులు, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

జార్ఖండ్ విజయంపై కాంగ్రెస్ సంబరాలు

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్‌లో కాంగ్రెస్, వాయనాడ్‌లో ప్రియాంకగాంధీ ఘన విజయం సాధించడంతో శనివారం ఆ పార్టీ నాయకులు పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా విజయమన్నారు. కార్యక్రమంలో నాని, కరీముల్లా, నవీన్, ఆంటోని, మునిరాజా, తిరుపాల్, చందు, మారి, సంతోష్, అరుణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యలకు వేగంగా పరిష్కారం

● అధికారులకు ఆర్డీవో ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే సమస్యల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి అధికారులకు సూచించారు. తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల వివరాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల పరిధిలో రీసర్వే ద్వారా ఉత్పన్నమైన సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే బాధితులకు సకాలంలో న్యాయం చేయాలన్నారు. భూముల రికార్డులను మ్యుటేషన్ చేయడం, రికార్డులను మార్చే సమయంలో అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఉచిత ఇసుక విధానానికి ఆటంకం కలిగించకుండా చూడాలన్నారు. అలాగే అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

శ్రీకాళహస్తి, నవంబరు 23(ఆంధ్రపజ్యోతి): వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మిన్నల రవిని శనివారం శ్రీకాళహస్తి క్రైస్తవ ఐక్య ప్రభోదకులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రవి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేట బాలాజీరెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, ఎంఎస్‌రెడ్డి, మునిరాజాయాదవ్, యాదగిరి, గోపాల్, పాస్టర్లు సుందర్‌రాజ్, గుడార్ మధు, కొండయ్య, సామ్‌పాల్, రవి డానియల్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.●రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివంను శనివారం పట్టణానికి చెందిన నాయి బ్రాహ్మణ, క్షవర, వాయ్యి కళాకారుల సేవా సంఘం నాయకులు కలిసి సన్మానించారు. సంఘం అధ్యక్షుడె మహేంద్ర, బాలసుబ్రహ్మణ్యం, వెంకటముని, సుబ్రహ్మణ్యం, కరుణాకర్, హేమాద్రి, సుబ్రమ్మణ్యం, సతీష్, మురలి, సుబ్బు, పాల్గొన్నారు.

ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన

సత్యవేడు, నవంబరు 23: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దాస్ డిగ్రీ కళాశాల్లో శనివారం ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ బీఎల్వోలు, రెవెన్యూ కార్యాలయాల వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ సుజాత, దాస్ కళాశాల ప్రిన్సిపల్ పరంధామ్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి తదితరులు పాల్గొన్నారు.బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఓటర్ల నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తిరుచానూరు గ్రామం, యోగిమల్లవరం, చైతన్యపురం ఇం.నెం.9-22/90లో యుండు యం.ప్రభుదాస్ గారి భార్య కె.నిరోష గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు కె.నిరోష గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహార మునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి అప్పులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : తిరుపతి జిల్లా, పుత్తూరు సబ్.డి., వడమాలపేట మండలం, నెం. 2గి, యస్.వి. పురం గ్రామ లెక్కదాఖలాలో

పుంజ	సర్వే నెంబర్లు	విస్తీర్ణం
పుంజ	369-6	ఎ.1.62 సెంట్లు
పుంజ	369-11	ఎ.0.48 సెంట్లు
పుంజ	369-12	ఎ.0.71 సెంట్లు

వెరశి విస్తీర్ణం ఎ.2.81 సెంట్లులో వేసిన లేఅవుట్ ప్లాట్లలో నెంబరు 11కి హద్దులు మరియు కొలతల వివరం. తూర్పు : ప్లాటు నెంబరు 10, పడమర : ప్లాటు నెంబరు 12, ఉత్తరం : 30 అడుగులు వెడల్పు గల వీధి, దక్షిణం :ఇతరుల జాగా. ఈ మధ్య తూర్పు పడమర అడుగులు 30, మీటర్లు 9.144, ఉత్తర దక్షిణం తూర్పు పార్శ్వం అడుగులు 51.50, మీటర్లు 15.697 ఉత్తర దక్షిణం పడమర పార్శ్వం అడుగులు 52.25 మీటర్లు 15.926 అనగా అంకె 1556.25 చదరపు అడుగులు లేక ఇందుకు సరైన 172.916 చదరపు గజములు గల ఖాళీ జాగా పూరా.

జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్, డో.నెం.8-114/2 రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రబాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తొలుత స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య నిర్వహించిన ఊంజలసేవలో భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి 1 మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తిరుపతి నగరం, రేణిగుంట రోడ్డు, కృష్ణారెడ్డి నగర్, ఆటోనగర్, ఇం.నెం. 14-249లో యుండు చర్లోపల్లి వెంకటేష్ గారి భార్య చర్లోపల్లి నీరజ గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు చర్లోపల్లి నీరజ సోదరుడు జి. సేతుమాధవ రెడ్డి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి అప్పులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : తిరుపతి డిస్ట్రిక్ట్, తిరుపతి రూరల్ సబ్ డిస్ట్రిక్ట్, తిరుపతి రూరల్ మండలం, నెంబరు 12, వేమూరు గ్రూపు, నెంబరు.13 బ్రాహ్మణపట్టు గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్లు 244/1బి1, 244/1బి2, 244/1సి, 244/1డి, 244/3, 244/3ఎ1, 244/3ఎ2, 244/3సి, 244/6, 244/ 6ఎ1, 244/6ఎ2, 244/6సి, 244/8, 244/8ఎ1, 244/8ఎ2, 244/8బి/2, 244/8సి, 244/11, గల భూములు డి.టి.సి.(జె)2509/2014, తేది: 21-08-2014గా ల్యాండ్ కన్వర్షన్ కాబడిన భూములో వేసియుండు లే-అవుట్ ప్లాట్లలో 1వ అయిటం:- ప్లాటు నెంబరు.139 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు : 16 అడుగులు వెడల్పు గల రోడ్డు పడమర : ప్లాటు నెంబరు.141 గల జాగాకు ఉత్తరం : ఇతరుల ప్రహరీగోడ, దక్షిణం : ప్లాటు నెంబరు 140 గల జాగాకు ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు నుండి పడమరకు అడుగులు 42 కు మీటర్లు 12.801, ఉత్తరం నుండి దక్షిణంకు అడుగులు 21-6 కు మీటర్లు 6.553, మొర్చు చదరపు అడుగులు 903 లేక చదరపు గజములు 100.33 లేక అంకణములు 25.33 గల జాగా పూరా. 2వ అయిటం:-ప్లాటునెంబరు. 140 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు : 16 అడుగులు వెడల్పు గల రోడ్డు పడమర : ప్లాటునెంబరు.142 గల జాగాకు ఉత్తరం : ప్లాటునెంబరు. 139 గల జాగాకు దక్షిణం : 33 అడుగులు వెడల్పు గల రోడ్డు. ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు నుండి పడమరకు అడుగులు 42 కు మీటర్లు 12.801, ఉత్తరం నుండి దక్షిణంకు అడుగులు 21-6 కు మీటర్లు 6.553, మొర్చు చదరపు అడుగులు 903 లేక చదరపు గజములు 100.33 లేక అంకణములు 25.33 గల జాగా పూరా. 3వ అయిటం:- ప్లాటు నెంబరు. 141 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు : ప్లాటు నెంబరు.139 గల జాగాకు, పడమర : 16 అడుగులు వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ఇతరుల ప్రహరీగోడ, దక్షిణం : ప్లాటునెంబరు.142 గల జాగాకు. ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు నుండి పడమరకు అడుగులు 42 కు మీటర్లు 12.801, ఉత్తరం నుండి దక్షిణంకు అడుగులు 21-6 కు మీటర్లు 6.553, మొర్చు చదరపు అడుగులు 903 లేక చదరపు గజములు 100.33 లేక అంకణములు 25.33 గల జాగా పూరా. 4వ అయిటం:- ప్లాటు నెంబరు. 142 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు : ప్లాటు నెంబరు. 140 గల జాగాకు పడమర : 16 అడుగులు వెడల్పు గల రోడ్డు ఉత్తరం : ప్లాటు నెంబరు 141 గల జాగాకు దక్షిణం : 33 అడుగులు వెడల్పు గల రోడ్డు ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు నుండి పడమరకు అడుగులు 42 కు మీటర్లు 12.801, ఉత్తరం నుండి దక్షిణంకు అడుగులు 21-6 కు మీటర్లు 6.553, మొర్చు చదరపు అడుగులు 903 లేక చదరపు గజములు 100.33 లేక అంకణములు 25.33 గల జాగా పూరా. 5వ అయిటం:- ప్లాటునెంబరు.143 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు : 16 అడుగులు వెడల్పు గల రోడ్డు, పడమర : ప్లాటునెంబరు. 145 గల జాగాకు ఉత్తరం : ఇతరుల ప్రహరీగోడ, దక్షిణం : ప్లాటునెంబరు. 144 గల జాగాకు. ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు నుండి పడమరకు అడుగులు 40 కు మీటర్లు 12.192, ఉత్తరం నుండి దక్షిణంకు అడుగులు 31 కు మీటర్లు 9.448, మొర్చు చదరపు అడుగులు 1240 లేక చదరపు గజములు 137.77 లేక అంకణములు 34.44 గల జాగా పూరా. 6వ అయిటం:- ప్లాటునెంబరు. 144 గల జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు : 16 అడుగులు వెడల్పు గల రోడ్డు, పడమర : ప్లాటు నెంబరు. 146 గల జాగాకు, ఉత్తరం : ప్లాటు నెంబరు. 143 గల జాగాకు, దక్షిణం : 33 అడుగులు వెడల్పు గల రోడ్డు. ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు నుండి పడమరకు అడుగులు 40 కు మీటర్లు 12.192, ఉత్తరం నుండి దక్షిణంకు అడుగులు 31 కు మీటర్లు 9.448, మొర్చు చదరపు అడుగులు 1240 లేక చదరపు గజములు 137.77 లేక అంకణములు 34.44 గల జాగా పూరా. మొత్తం ఆరు అయిటంల విస్తీర్ణం చదరపు గజములు 676.86 మొత్తం

జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం.8-114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564